మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 31-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 32 Issue: 32

31 జూలై 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:58 సూర్యాస్తమయం - సా. 6:46 తిథి విదియ రా. 10:29 వరకు తరువాత తదియ సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం ధనిష్ఠ రా. 7:15 వరకు తరువాత శతభిష యోగం సౌభాగ్య రా. 11:50 వరకు కరణం తైతుల ఉ. 10:02 వరకు గరజ రా. 10:29 వరకు వర్జ్యం తె. 3:01 నుండి తె. 4:42 వరకు దుర్ముహూర్తం ఉ. 8:32 నుండి ఉ. 9:23 వరకు మ. 12:48 నుండి మ. 1:39 వరకు రాహుకాలం ఉ. 10:46 నుండి మ. 12:22 వరకు యమగండం మ. 3:34 నుండి సా. 5:10 వరకు గుళికాకాలం ఉ. 7:34 నుండి ఉ. 9:10 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:22 నుండి తె. 5:10 వరకు అమృత ఘడియలు ఉ. 8:17 నుండి ఉ. 10:00 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## ఐటీఆర్ ఫైలింగ్‌కు నేడే ఆఖరు

**ఆలస్యమైతే రూ. 5,000 ఫైన్.. ఇప్పటికి 5 కోట్ల రిటర్న్స్ దాఖలు**

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలుకు గడువు సమీపిస్తోంది. ఆడిట్ అవసరం లేని పన్ను చెల్లింపు దారులు 2026–27 అసెస్‌మెంట్ సంవత్సరానికి గాను జులై 31లోగా తమ రిటర్నులను సమర్పించాల్సి ఉంది. ఈ గడువు ముగియడానికి మరో ఒక్క రోజు మాత్రమే సమయం మిగిలి ఉంది. నిర్ణీత గడువులోగా ఐటీఆర్ దాఖలు చేయడంలో విఫలమైతే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత సమయంలోగా ఐటీఆర్ ఫైల్ చేయని వారు ఆలస్య రుసుము చెల్లించి, డిసెంబర్ 31, 2026 వరకు తమ రిటర్నులను సమర్పించవచ్చు. నిబంధనల ప్రకారం, వార్షిక తరువాయి 2 వ పేజీలో...




## ఈ-20తో మైలేజ్ తగ్గుతుంది.. కానీ!

న్యూఢిల్లీ: 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ–20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ 2 నుంచి 6 శాతం మేర తగ్గుతుందన్నారు. వాహన రకం, అది ఏ సంవత్సరంలో తయారైంది? అనే దానిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ మేరకు పార్లమెంట్‌లో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఈ–20 వాడకం వల్ల వాహనంలో గానీ, ఇంజిన్‌లో గానీ ఇప్పటివరకు ఎలాంటి సమస్యలు తరువాయి 2 వ పేజీలో...



## 'పేపర్ లీక్' బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలను, అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు–2026'(యాంటీ పేపర్ లీక్ బిల్లు) కు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుకు ఇప్పటికే లోక్‌సభ ఆమోదం తరువాయి 2 వ పేజీలో...




# ఇంజినీరింగ్ స్టూడెంట్స్ క్రిమినల్ వేస్ట్

**ఒక్కరికి జాబ్ అప్లికేషన్ నింపరాదు.. సీఎం రేవంత్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు**

'సంవత్సరానికి లక్షా 10 వేల మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు సర్టిఫికేట్స్ తీసుకొని బయటకు వస్తున్నారు. మీరు ఆ పిల్లలను అప్లికేషన్ ఇచ్చి వాని ఉద్యోగానికి అప్లికేషన్ నింపమని ఇయ్యండి.. వారికి కనీసం జాబ్ అప్లికేషన్ నింపడం కూడా రాదు' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎంసీఆర్హెచ్చార్డీ ప్రాంగణంలోని దాశరథి ఆడిటోరియంలో ఫిన్‌లాండ్, జర్మనీ ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్ ప్రతినిధులతో ఇంటరాక్షన్ ప్రోగ్రామ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్, జూలై 30 (ఈవార్తలు): 'నేను మీ టీచర్లకు చెబుతున్నా. మీరు వాళ్లను పిలిచి ఇంజినీరింగ్ సర్టిఫికెట్లను తీసుకొచ్చి.. మీరు చదువు చెబుతున్న ఊరిలో ఉన్న పిల్లలను పిలిపించి తెల్ల కాగితాన్ని ఇచ్చి జాబ్ కోసం అప్లికేషన్ నింపమనండి. ఇది క్రిమినల్ వేస్ట్.. వాడు ఇంజినీరింగ్ చదువుకున్నానని చిన్న జాబ్‌కు పోడు. స్కిల్స్ నేర్చుకోడు. తల్లిదండ్రులేమో మా కొడుకు ఇంజినీరింగ్ అయిపోయింది.. ఉద్యోగం అంటరు.. నియోజకవర్గంలో నా దగ్గరకు వస్తుంటరు. మావోడు ఇంజినీరింగ్ చదివిండు.. పెద్ద పెద్ద చదువులు చదివిండు సార్ అంటరు. తల్లిదండ్రులకు తెలియదు కదా' అని చెప్పుకొచ్చారు.

**నేనెందుకు రాజీనామా చేస్తా?**

రాష్ట్రంలో విద్యాశాఖ లేదని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని.. తనను రాజీనామా చేయాలని అంటున్నాయని రేవంత్ అన్నారు. ఎందుకు -2 వ పేజీలో...

# నిరుద్యోగుల మెరుపు ధర్నా

**వర్షాన్నీ లెక్క చేయకుండా తరలిన ఉద్యోగార్థులు**

**అన్ని పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి**

**19,000 పోలీస్ నియామకాలు చేపట్టాలి**

**ఎస్సై, కానిస్టేబుల్‌కు వయోపరిమితిని సడలించాలె**

**వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలె**

**రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్లు**

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు మరోసారి ఆందోళన బాట పట్టారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్, చిక్కడపల్లి ప్రాంతాల్లో భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిరుద్యోగులు మెరుపు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 19,000 పోలీస్ పోస్టులతో నియామక నోటిఫికేషన్ విడుదల చేయాలని, అలాగే ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ట వయోపరిమితిని సడలించాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో పాల్గొన్న అభ్యర్థులు మెగా డీఎస్సీ, గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



హైదరాబాద్, జూలై 30 (ఈవార్తలు): భారీ వర్షంలోనూ ఆందోళన కొనసాగడంతో అశోక్‌నగర్ ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'వెంటనే 19,000 పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలి, ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు వయోపరిమితి సడలింపు ఇవ్వాలి, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి. గ్రూప్1, 2, 3, 4 నియామకాలను వేగవంతం చేయాలి. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలి.' అని డిమాండ్ చేశారు. కుండపోత వర్షం కురుస్తున్నప్పటికీ అభ్యర్థులు తమ ఆందోళనను విరమించకుండా రోడ్డుపై తరువాయి 2 వ పేజీలో...




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,351 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,891 |

## విశ్వవాణి



అత్యంత ప్రమాదకరమైన మెలనోమా చర్మ కేన్సర్ చికిత్సలో శస్త్రచికిత్సకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడే వినూత్న హీట్–యాక్టివేటెడ్ స్కిన్ ప్యాచ్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ప్రయోగశాల, ఎలుకలపై నిర్వహించిన పరీక్షల్లో ఈ ప్యాచ్ మెలనోమా కణితులను గణనీయంగా తగ్గించినట్లు పరిశోధకులు వెల్లడించారు. అయితే ఈ చికిత్సను ఇప్పటివరకు మనుషులపై పరీక్షించలేదని, దాని భద్రత, ప్రభావం ఇంకా నిర్ధారణ కాలేదని స్పష్టం చేశారు.

## ఆర్టీసీ ఆటోలు వచ్చేస్తున్నాయ్!

**త్వరలో రోడ్డెక్కనున్న టీజీఎస్ ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలు.. తక్కువ చార్జీలతో 'లాస్ట్ మైల్ కనెక్టివిటీ'**

ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ.. హైదరాబాద్ నగరంతో పాటు ప్రధాన పట్టణాల్లో బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, అలాగే బస్సు దిగిన ప్రయాణ ప్రాంగణం నుంచి గమ్యస్థానానికి సజావుగా చేరుకునేందుకు వీలుగా ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్ కనెక్టివిటీ విధానంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెడుతోంది. ఇందుకోసం ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు




హైదరాబాద్, జూలై 30 (ఈవార్తలు): . ఈ చర్చలు సఫలమైన వెంటనే ఈ–ఆటోలు రోడెక్కనున్నాయి. ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునే వెసులుబాటును ఆర్టీసీ కల్పిస్తోంది. ప్రయాణికుడు ఉన్న నివాస ప్రాంతం నుంచి సమీపంలో ఉన్న బస్ పాయింట్ వరకు ఈ ఆటో తీసుకెళ్తుంది. ఆ తర్వాత బస్సు దిగిన స్థానం నుంచి చేరుకోవాల్సిన ఆఖరి గమ్యస్థానానికి కూడా ఈ ఆటో సేవల ద్వారా చేరుకోవచ్చు. దీనివల్ల ప్రయాణికులకు సమయం గణనీయంగా - 2 వ పేజీలో...



# వందేమాతరం!

**జాతీయ గేయం బిల్లుకు లోక్‌సభ ఆమోదం.. మూజువాణి ఓటుతో నెగ్గిన బిల్లు**

కేంద్రం ప్రవేశపెట్టిన వందేమాతరం బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. గురువారం లోక్‌సభలో ఈ బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. రాజ్యసభలో బుధవారమే ఈ బిల్లు ఆమోదం పొందగా.. గురువారం లోక్‌సభలో ఆమోదం లభించింది. ఇప్పుడు ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇందుకోసం ఈ బిల్లును రాష్ట్రపతి ముందుకు పంపనుంది కేంద్రం.

న్యూఢిల్లీ: 'ద ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ (అమెండ్‌మెంట్) బిల్, 2026 పేరుతో రూపొందిన ఈ బిల్లును జూలై 24న కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. దీనికి జూలై 29న రాజ్యసభ ఆమోదం తెలిపింది. అనంతరం జూలై 30, గురువారం లోక్‌సభలో బిల్లు నెగ్గింది. ప్రతిపక్షాల నిరసనలు, ఆందోళనల మధ్యే ఈ బిల్లు మూజువాణి ఓటుతో సభలో ఆమోదం పొందడం విశేషం. నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై తరువాయి 2 వ పేజీలో...

**ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్..**



## పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూత

**అనారోగ్యంతో యశోద ఆస్పత్రిలో తుదిశ్వాస**

**తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర**

హైదరాబాద్: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూశారు. గురువారం అర్ధరాత్రి సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. గత - 2 వ పేజీలో...

## మా ఫ్యామిలీని చంపుతారట



**బీజేపీలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారు**

**అభిజీత్ దీప్కే సంచలన ఆరోపణలు**

న్యూఢిల్లీ: బీజేపీపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్ర ఆరోపణలు చేశారు. జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న సమయంలో తన కుటుంబాన్ని చంపుతామని బెదిరించారని ఆరోపించారు. తన స్వస్థలం ఛత్రపతి సంభాజీనగర్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యతిరేక ఆందోళన సమయంలో తనకు నిరంతరం బెదిరింపులు ఎదురయ్యాయని తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలుపుతోన్న విద్యార్థులను అణచివేయడానికి పోలీసులు ప్రాణాంతక ఆయుధాలను వాడుతున్నారని దీప్కే దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలాగే, నూతన విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఎంపిక, ఆయన వైఖరి దేశానికి తప్పుడు సంకేతాలు తరువాయి 2 వ పేజీలో...



## కేసులు కొట్టేస్తాం.. వాళ్లను వదలం

**జంతర్ మంతర్ ఆందోళనపై ఢిల్లీ సర్కారు వ్యాఖ్య**

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో నిరసన కారులపై కేసుల విషయంలో ఢిల్లీ ప్రభుత్వం దిగి వచ్చింది. విద్యార్థులపై కేసుల పేరుతో వేధిస్తే మరోసారి ఉద్యమిస్తామని కాక్రోచ్ జనతా పార్టీ హెచ్చరించిన క్రమంలో.. నిరసన కారులపై చర్యలు ఉండవని చెప్పింది ప్రభుత్వం. ఈ వ్యవహారంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ.. కేసులు, అరెస్టులు కొనసాగుతున్నాయనే ఆరోపణలతో ఢిల్లీ ప్రభుత్వం ఈ తరువాయి 2 వ పేజీలో...

# గణేశ విగ్రహాలు 16 ఫీట్లు దాటొద్దు

**తయారీదారులకు సజ్జనార్ వార్నింగ్.. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక**

హైదరాబాద్, జూలై 30 (ఈవార్తలు): గణేశ్ ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో విగ్రహాల తయారీదారులకు నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తాజాగా కీలక ఆదేశాలు జారీ చేశారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన హైదరాబాద్ సీపీ.. గణేశ్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగుల కంటే ఎక్కువ ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇక ఈ ఏడాది ఖైరతాబాద్ మహా గణపతిని 69 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో తీర్చిదిద్దనున్నారు. నిబంధనలను -2 వ పేజీలో...



# రాశి ఫలాలు

31.7.2026

మేషం: ముఖ్యమైన వ్యవహారాలలో కార్యసిద్ధి కలుగుతుంది. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. బంధు మిత్రుల ఆదరణ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆటుపోట్లు తొలగుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు.

వృషభం: వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి. ఆప్తుల నుండి కీలక సమాచారం అందుతుంది. అనుకున్న పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. నూతన వ్యాపారాలు విస్తరిస్తారు. నిరుద్యోగులు శుభవార్తలు అందుకుంటారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

మిథునం: ఋణదాతల ఒత్తిడి పెరుగుతుంది. చేపట్టిన పనులు మందకోడిగా సాగుతాయి. తొందరపడి ఇతరులతో మాట్లాడటం మంచిది కాదు. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక నష్టాలు తప్పవు. ఉద్యోగమున అధికారుల ఆగ్రహానికి గురవుతారు. సంతాన అనారోగ్య సమస్యలుంటాయి.

కర్కాటకం: కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. సమాజంలో ప్రముఖుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూరపు బంధువుల ఆగమనంతో గృహమున సందడి వాతావరణం ఉంటుంది. వృత్తి , వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి.

సింహం: నూతన వాహన యోగం ఉన్నది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. చేపట్టిన పనులలో అవరోధాలు అధిగమించి ముందుకు సాగుతారు. బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

కన్య: పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో ఆకస్మిక మార్పులుంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఖర్చుకు తగినంత ఆదాయం ఉండదు.వృధా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారంలో భాగస్థులతో విభేదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని బారం తప్పదు.

తుల: ఆదాయ వ్యవహారాలు ఉత్సహాన్నిస్తాయి. ఇంటా బయట విషయాలలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. కొన్ని వ్యవహారాలలో కుటుంబ సభ్యుల సలహాలు కలసివస్తాయి. సేవా కార్యక్రమాలకు సహాయం అందిస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో వివాదాలు పరిష్కారమవుతాయి.

వృశ్చికం: ముఖ్యమైన వ్యవహారాలు వ్యయప్రయాసలతో కాని పూర్తికావు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. అవసరానికి ధనం చేతిలో నిల్వఉండదు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. కుటుంబ సభ్యులుతో మాటపట్టింపులుంటాయి. ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది. ఉద్యోగాలలో శ్రమ తప్పదు.

ధనస్సు: నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వృత్తి ఉద్యోగాలలో కష్టానికి తగిన ఫలితం పొందుతారు. నూతన గృహం కొనుగోలు ప్రయత్నాలకు ఆటంకాలు తొలగుతాయి. ధనపరంగా మరింత పురోగతి కలుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

మకరం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగాలలో మీ నిర్ణయాలకు తగిన ప్రశంసలు అందుకుంటారు. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. చిన్ననాటి మిత్రులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారమునకు పెట్టుబడులు అందుతాయి.

కుంభం: మీ ప్రవర్తన ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుంది. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఋణ దాతల ఒత్తిడి పెరుగుతుంది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో కొత్త సమస్యలు ఎదురవుతాయి. ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

మీనం: ఇతరులకు మాట ఇచ్చే విషయంలో జాగ్రత్త వహించాలి. పనులలో శ్రమ పెరుగుతుంది. ధనపరమైన ఇబ్బందులు తప్పవు. ఆరోగ్యం సహకరించక చికాకు పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులతో మనస్పర్థలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో చికాకులు ఉంటాయి.



# నిరుద్యోగుల మెరుపు ధర్నా

మొదటి పేజీ తరువాయి

బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఆలస్యం చేయకుండా తక్షణమే నియామకాల షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. ఆందోళనలో పాల్గొన్న అభ్యర్థులు మాట్లాడుతూ, ఉద్యోగ నోటిఫికేషన్ల ఆలస్యమవడంతో తమ వయోపరిమితి దాటిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పోలీస్ నియామకాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందని మండిపడ్డారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై స్పందించే రాహుల్ గాంధీ, తెలంగాణ నిరుద్యోగుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. వయోపరిమితి సడలింపు, జీవో 46, జీవో 29లను రద్దు చేసేవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. అశోక్‌నగర్ ఎక్స్‌రోడ్స్, చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ ప్రాంగణంలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను నిరోధించారు. నిరసనకారులను బలవంతంగా లాగివేసి, ముందస్తు జాగ్రత్తగా పలువురు నిరుద్యోగ జేఏసీ నాయకులను, అభ్యర్థులను అరెస్ట్ చేసి పోలీస్ వాహనాల్లో సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీంతో ఆ ప్రాంతంలో కాసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

## గణేశ్ విగ్రహాలు 16 ఫీట్లు దాటొద్దు

మొదటి పేజీ తరువాయి

ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ సజ్జనార్ తీవ్ర హెచ్చరికలు చేశారు. గురువారం గణేశ్ విగ్రహాల తయారీదారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడిన సీపీ సజ్జనార్.. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా వినాయక ఉత్సవాలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణేశ్ విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు గుర్తుచేశారు. వినాయక విగ్రహాల రవాణా సమయంలో జరిగిన 4 ప్రమాదాల నేపథ్యంలో ఈసారి మరింత అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. మట్టి గణేశ్ విగ్రహాల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని.. చిన్న విగ్రహాల ప్రతిష్ఠాపనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సీపీ సజ్జనార్ సూచించారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, సురక్షిత విద్యుత్ వైరింగ్ తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉపయోగించే క్రేన్లు, వాహనాలు అధికారికంగా ధ్రువీకరించినవే కావాలని పేర్కొన్నారు. ధూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేకంగా ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను ఏర్పాటు చేయాలని తయారీ దారులకు సజ్జనార్ సూచించారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణా చేయవద్దని.. రవాణాకు ముందు ట్రాఫిక్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. విగ్రహాల బుకింగ్, రవాణా సమయం, మార్గాల వివరాలను ముందుగానే పోలీసులకు అందించాలని చెప్పారు. విద్యుత్ తీగలు, ఫ్లైఓవర్లు, మెట్రో మార్గాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు ప్రణాళికతో విగ్రహాల రవాణా చేపట్టాలని సూచించారు.

## 'పేపర్ లీక్' బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

తెలపగా, తాజాగా రాజ్యసభ కూడా ఆమోదం తెలిపింది. దీంతో పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ఈ బిల్లుకు ఆమోద ముద్ర లభించినట్లయ్యింది. బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేసిన ఆయన.. పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలన్నీ పేపర్ లీకుల సమస్యను ఎదుర్కొన్నాయని మోదీ గుర్తుచేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని పెంచడం, వేగవంతమైన వ్యవస్థలను అమలు చేయడం, పారదర్శకతను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొత్త చట్టంతో పేపర్ లీక్ ముఠాలపై మరిన్ని కఠిన చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## మా ఫ్యామిలీని చంపుతారట

మొదటి పేజీ తరువాయి

పంపుతున్నాయని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో పతంజలి అధినేత, ప్రముఖ యోగా గురు బాబా రామ్‌దేవ్‌కి సైతం చురకలంటించారు. ఆయన రాజకీయాల గురించి మాట్లాడం మానేసి, తమ ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే కేంద్రం నేరస్తులను, అత్యాచారాలకు పాల్పడేవారిని రక్షిస్తోందని ఆరోపించారు. జంతర్ మంతర్ వద్ద నిరసన సమయంలో తనపై చాలా ఒత్తిడి ఉందని దీప్కే చెప్పారు. "నేను బీజేపీలో చేరకపోతే.. అది నా కుటుంబానికి హాని చేస్తుందని బెదిరించారు" అని దీప్కే ఏఎన్ఐ వార్తా సంస్థతో పేర్కొన్నారు. ఉన్నత స్థానాల్లో ఉన్నవారు తనలాంటి విద్యార్థిని బెదిరించడం సిగ్గుచేటని, యువతను బెదిరించడానికి ఆ పదవులను ఉపయోగిస్తుంటే వాటికి విలువ ఏముందని ఆయన ప్రశ్నించారు. దేశ యువతను దీప్కే తప్పుదారి పట్టిస్తున్నారన్న రామ్‌దేవ్ విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. "మా గురించి మీకు చింతించాల్సిన అవసరం లేదు.. నాసిరకమైన పతంజలి ఉత్పత్తుల గురించి ఆలోచించండి" అని ఎగతాళి చేశారు. ప్రజాస్వామ్యం, విద్య, విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం చేయడం, ప్రభుత్వాన్ని నిలదీయడం సమాజాన్ని నాశనం చేయడం కాదని దీప్కే నొక్కి చెప్పారు. "ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కోసం, ఒకరి భవిష్యత్తు, విద్యా హక్కు కోసం పోరాడటం సంస్కృతిని నాశనం చేస్తే.. నేను ఆ పోరాటాన్ని కొనసాగిస్తాను" అని ఆయన అన్నారు. రాజకీయాలపై మాట్లాడటం మానేసి, పతంజలి ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచడంపై దృష్టి పెడితే మంచిదని బాబా రామ్‌దేవ్‌పై పరోక్షంగా విమర్శలు చేశారు. విద్యార్థులపై జరిగిన పోలీసుల క్రూరత్వానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షానే బాధ్యుడని తాను బలంగా నమ్ముతున్నానని దీప్కే అన్నారు.

## ఈ-20తో మైలేజ్ తగ్గుతుంది.. కానీ!

మొదటి పేజీ తరువాయి

తలెత్తలేదని గడ్కరీ అన్నారు. ఈ-10 ఇంధనంతో పోలిస్తే ఈ-20 పెట్రోల్ 30 శాతం కర్బన ఉద్గారాలను తగ్గిస్తుందన్నారు. అంతేకాకుండా యాక్సిలరేషన్ మెరుగవుతుందన్నారు. బీఎస్-3, బీఎస్-4, బీఎస్ -6 ఈ-10 (గ్యాసోలిన్) టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాల్లో ఇ20 పెట్రోల్ వాడకాన్ని అంచనా వేయడానికి అధ్యయనం జరిపినట్లు తెలిపారు. వాహన నిర్వహణ ఖర్చులు పెరుగుతాయని, ఇంధన సామర్థ్యం తగ్గుతుందంటూ వస్తున్న విమర్శలను తోసిపుచ్చారు. ఇథనాల్ బ్లెండెడ్ ప్రోగ్రామ్ 2001లోనే పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభమైందని మంత్రి గుర్తు చేశారు. 2006లో ఇ5 (ఇథనాల్ 5 శాతం) తీసుకురాగా.. ఉత్పత్తి సామర్థ్యం మేరకు క్రమక్రమంగా పెంచుకుంటూ వచ్చినట్లు తెలిపారు.

## ఐటీఆర్ ఫైలింగ్‌కు నేడే ఆఖరు

మొదటి పేజీ తరువాయి

ఆదాయం రూ. 5 లక్షల వరకు ఉన్నవారికి రూ. 1,000, అంతకంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారికి రూ. 5,000 వరకు జరిమానా విధిస్తారు. అయితే, ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితి కంటే తక్కువ ఆదాయం ఉన్నవారికి ఈ రుసుము వర్తించదు. కాకపోతే, చెల్లించాల్సిన పన్ను బకాయిలు ఏవైనా ఉంటే, వాటిపై వడ్డీ వర్తిస్తుంది. ఆదాయపు పన్ను శాఖ గణాంకాల ప్రకారం, జులై 29 నాటికి 5.02 కోట్లకు పైగా రిటర్నులు దాఖలయ్యాయి. వీటిలో 4.69 కోట్లు వెరిఫై కాగా, 2.33 కోట్లు ఇప్పటికే ప్రాసెస్ అయ్యాయి. ఇటీవల ఒకే రోజులో దాదాపు 30 లక్షల రిటర్నులు సమర్పించడం గమనార్హం. గడువులోగా రిటర్నులు దాఖలు చేయకపోతే రీఫండ్లు ఆలస్యమవడమే కాకుండా, కొన్ని రకాల నష్టాలను తర్వాతి సంవత్సరాలకు క్యారీ ఫార్వర్డ్ చేసుకునే వెసులుబాటును కోల్పోతారని పన్ను నిపుణులు సూచిస్తున్నారు.

# వందేమాతరం!

మొదటి పేజీ తరువాయి

దాడి వంటి అంశాలపై లోక్‌సభలో వాడివేడి చర్చ జరుగుతుండగానే ఈ బిల్లును కేంద్రం పాస్ చేయించుకుంది. ఉభయ సభల ఆమోదం పొందిన ఈ బిల్లు చట్టంగా మారాలంటే దీనికి రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇప్పటికే ఉన్న 'ద ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్, 1971కి ఇది సవరణ బిల్లు. దీని ప్రకారం జాతీయ గీతమైన జనగణమనలాగే, జాతీయ గేయమైన వందేమాతరాన్ని కూడా గౌరవించాల్సి ఉంటుంది. ఈ గేయాన్ని అవమానపరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. భారత రాజ్యాంగం, జాతీయ పతాకం, జాతీయ గీతంలాగే ఇకపై జాతీయ గేయానికి కూడా చట్టబద్ధమైన రక్షణ, గౌరవం ఉంటుంది. ఈ చట్టం ప్రకారం.. వందేమాతరం గేయాన్ని అవమానిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొన్నిసార్లు జరిమానా కూడా విధిస్తారు. వందేమాతరం పాడేటప్పుడు ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగించినా, అడ్డుకున్నా కూడా శిక్షార్హులే. వందేమాతరం రాసి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ బిల్లును, ఆ గేయానికి గౌరవ సూచకంగా ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది.

మా ప్రాథమిక హక్కులపై దాడి: అసదుద్దీన్ ఒవైసీ

న్యూఢిల్లీ: వందేమాతరం బిల్లుపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలు వాయిదా పడిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన, ఈ చట్టం దేశ రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 'జనగణమన', 'వందేమాతరం'ల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మన జాతీయ గీతమైన 'జనగణమన' పాడినప్పుడు భారతదేశ వైవిధ్యం, ఇక్కడి ప్రజల ఐక్యత కళ్లముందు కదలాడుతాయని... అయితే 'వందేమాతరం' మాత్రం ఒక నిర్దిష్ట పూజా విధానాన్ని, దేవతల ఆరాధనను ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా 1950 నాటి చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ.. నాటి తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఎలాంటి పార్లమెంటరీ తీర్మానం లేకుండానే వందేమాతరానికి జాతీయ గేయ హోదా ఇవ్వడం సరైన నిర్ణయం కాదని వ్యాఖ్యానించారు. అసలు మన చట్టాల్లో గానీ, రాజ్యాంగంలో గానీ 'జాతీయ గేయం' అనే పదానికి కచ్చితమైన వర్గీకరణ లేదా నిర్వచనమే లేదని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్రం తెచ్చిన ఈ చట్టం రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులపై దాడి చేయడమేనని ఒవైసీ ఆరోపించారు. ముఖ్యంగా ఆర్టికల్స్ 25, 26, 29 కింద లభించే మత స్వేచ్ఛను, సాంస్కృతిక హక్కులను ఈ బిల్లు కాలరాస్తోందని ధ్వజమెత్తారు.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

ఆదివారం హనుమకొండలో ఛాతినొప్పితో అస్వస్థతకు గురైన సుదర్శన్‌రెడ్డికి వైద్యులు అత్యవసరంగా సీపీఆర్ నిర్వహించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వెంటిలేటర్‌పై సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న పెద్ది సుదర్శన్‌రెడ్డి, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించి ఎమ్మెల్యేగా సేవలందించారు. ఆయన మృతితో బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ ఉద్యమకారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## కేసులు కొట్టేస్తాం.. వాళ్లను వదలంఠ

మొదటి పేజీ తరువాయి

మేరకు గురువారం క్లారిటీ ఇచ్చింది. నిరసనల్లో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవద్దని ఢిల్లీ రాజధాని ప్రాంతం (ఎన్‌సిటి) వ్యాప్తంగా పోలీసు అధికారులను హోం శాఖ ఆదేశించినట్లు ప్రకటనలో తెలిపింది. విద్యార్థులను, సీజేపీ నిరసన కారులపై చర్యలు ఉండవని చెప్పిన ప్రభుత్వం.. నేర చరిత్ర ఉన్న వ్యక్తులను ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పింది. ఇప్పటికే క్రిమినల్ కేసులు ఉన్న వారికి ఈ మినహాయింపు వర్తించదని తెలిపింది. జూలై 20న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసన సందర్భంగా చెలరేగిన హింసాకాండకు సంబంధించి ఢిల్లీ పోలీసులు 13 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దీనిపై సీజేపీ నుంచి వ్యతిరేకత రావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బీహార్, అస్సాం, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై నిర్ణయం తీసుకున్నాయి. అదే బాటలో ఢిల్లీ ప్రభుత్వం చట్టపరమైన చర్యలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది.

## ఆర్టీసీ ఆటోలు వచ్చేస్తున్నాయ్!

మొదటి పేజీ తరువాయి

ఆదా కావడమే కాకుండా రవాణా ప్రయాసలు తప్పుతాయి. ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రారంభ దశలో హైదరాబాద్ గ్రేటర్ పరిధిలో ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ సేవలు విజయవంతమైన అనంతరం రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో దశలవారీగా విస్తరించాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు. ప్రస్తుతం ప్రధాన నగరాల్లో ప్రాచుర్యంలో ఉన్న ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల ఆటో ఛార్జీలతో పోలిస్తే ఆర్టీసీ ఆధ్వర్యంలో నడిచే ఈ-ఆటోల ఛార్జీలు చాలా తక్కువగా ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, రాజేంద్రనగర్, ఘట్‌కేసర్, శామీర్‌పేట్, శంషాబాద్, శేరిలింగంపల్లి వంటి కనెక్టివిటీ తక్కువగా ఉండే దూర ప్రాంతాల ప్రయాణికులకు గొప్ప ఊరట లభించనుంది. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేయడంలో ఆర్టీసీ ఈ-ఆటోల నిర్ణయం ఒక మైలురాయిగా నిలవనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఇంజినీరింగ్ స్టూడెంట్స్ క్రిమినల్ వేస్ట్

మొదటి పేజీ తరువాయి

రాజీనామా చేయాలో వారు చెప్పడం లేదని.. ఐటీఐలను ఏటీసీలుగా మార్చినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. దేశంలోని ఐఐటీలు, ఐఐఎంలు తెచ్చింది నెహ్రూ అని.. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ మొదటి ప్రాధాన్యతగా నెహ్రూ ముందుకెళ్లారని అన్నారు. 140 కోట్ల మందికి నేడు ఆహారం దొరుకుతుందంటే అందుకు నెహ్రూ ప్రణాళికలు కారణమని అన్నారు. 12 ఏళ్లలో మోదీ రూ.151 లక్షల కోట్లు అప్పు చేశారని... 60 ఏళ్లలో కాంగ్రెస్ చేసిన అప్పు రూ. 51 లక్షలు అని అన్నారు. దేశం అప్పు రూ.201 లక్షల కోట్లు ఉందని అన్నారు.ప్రపంచంతో పోటీ పడాలంటే విద్యలో నాణ్యత కావాలని... ఆహారంలో పోషకాహారం కావాలని అన్నారు సీఎం రేవంత్. వెనకబాటు తనానికి ఆస్తి లేకపోవడం కాదు.. విద్య లేకపోవడం కారణమని అన్నారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని.. అయితే విద్యార్థుల భవిష్యత్తు విషయంలో ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో విద్యా విధానాలను అధ్యయనం చేసి వచ్చిన ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన "ఐఏఎస్ అధికారులను ట్రాన్స్‌ఫర్ చేసినంత సులువుగా టీచర్లను బదిలీ చేయలేం" అనే వ్యాఖ్యలు ప్రత్యేక చర్చకు దారితీశాయి. పరిపాలనా వ్యవస్థలో అధికారుల బదిలీలు ఒక ప్రక్రియగా సాగినా.. ఉపాధ్యాయుల బదిలీల విషయంలో అనేక సామాజిక, కుటుంబ, విద్యార్థుల ప్రయోజనాలు ముడిపడి ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అందుకే ఉపాధ్యాయుల సమస్యలను సున్నితంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ప్రత్యేక సందేశం ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇకపై తమ వ్యక్తిగత సమస్యల కంటే విద్యార్థుల ప్రయోజనాల కోసం ప్రభుత్వంతో చర్చించాలని సూచించారు. ప్రమోషన్లు, బదిలీలు, ఇతర ఉద్యోగ సంబంధిత అంశాల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

## కుప్పలుగా 'కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్' దరఖాస్తులు

**రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో 50,000కు పైగా అప్లికేషన్లు**

హైదరాబాద్, జూలై 30 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్ఆర్‌సీ) జారీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. దరఖాస్తు చేసుకున్న రెండు పనిదినాల్లోనే ధ్రువీకరణ పత్రం అందజేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో గడువు పాటించకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడ్డాయి. ఈ పథకం ప్రారంభమైన జులై 27 నుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా 50 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. తొలిరోజే దరఖాస్తు చేసుకున్న వారికి సైతం ఇప్పటివరకు సర్టిఫికెట్లు అందకపోవడంతో, వారు నిత్యం మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నెల 25న విడుదల చేసిన జీవో 172 నిబంధనల ప్రకారం, దరఖాస్తు అందిన రెండు పనిదినాల్లోగా సంబంధిత తహశీల్దార్లు వాటిని పరిశీలించి సర్టిఫికెట్లను జారీ చేయాలి. అయితే, పలు ప్రాంతాల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు.



## పంచాయతీ నిధులపై విచారణ చేపట్టాలి

**కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బండి సంజయ్ లేఖ**

కరీంనగర్, జూలై 30 (ఈవార్తలు): తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేస్తున్న నిధుల వినియోగంలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని, మార్గదర్శకాలకు విరుద్ధంగా నిధులను పక్కదారి పట్టిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్ర నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలంటూ పంచాయతీ అధికారులపై, సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కలకు బండి సంజయ్ లేఖలు రాశారు. సర్పంచులు తమకు ఎదురవుతున్న ఒత్తిళ్లపై ఆధారాలతో సహా ఇచ్చిన ఫిర్యాదులను లేఖలకు జత చేసినట్లు ఆయన తెలిపారు. "గ్రామీణ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థే మూలస్తంభం. ఇక్కడ నిధులు పక్కదారి పడితే గ్రామాల అభివృద్ధి స్తంభించిపోవడమే కాకుండా, పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది" అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు తక్షణమే జోక్యం చేసుకుని, ఆధారాల ఆధారంగా పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## వైఎస్ జగన్ పెద్దనాన్న మృతి

పులివెందుల, జూలై 30 (ఈవార్తలు): వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబంలో వరుస విషాదాలు నెలకొంటున్నాయి. కొన్ని రోజుల క్రితమే అనారోగ్యంతో వైఎస్ జగన్ సోదరుడు కన్నుమూయగా.. ఇప్పుడు ఆయన పెద్దనాన్న చనిపోయారు. వైఎస్ జగన్ పెదనాన్న, వైఎస్ భాస్కర్ రెడ్డి సోదరుడైన వైఎస్ ఆనంద్ రెడ్డి ఇవాళ మృతి చెందారు. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్ ఆనంద్ రెడ్డి ఇవాళ చనిపోయారు. వైఎస్ ఆనంద్ రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే.. అక్కడే తుదిశ్వాస విడిచారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తండ్రి వైఎస్ రాజారెడ్డి సోదరుడైన వైఎస్ కొండారెడ్డి కుమారుడే ఈ వైఎస్ ఆనంద్ రెడ్డి. ఈ క్రమంలోనే వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ ఆనంద్ రెడ్డి వరసకు అన్నదమ్ములు అవుతారు. ఇక వైఎస్ ఆనంద్ రెడ్డి భార్య సుశీలమ్మ గత ఏడాది కన్నుమూశారు. వైఎస్ ఆనంద్ రెడ్డికి సునీత అనే కుమార్తె ఉన్నారు. ఇక శుక్రవారం రోజున వైఎస్ ఆనంద్ రెడ్డి అంత్యక్రియలు వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో జరగనున్నట్లు సమాచారం. అయితే ఈ అంత్యక్రియలకు వైఎస్ జగన్ హాజరు కానున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇక ఈ ఏడాది మొదట్లోనే వైఎస్ జగన్ సోదరుడు వైఎస్ అభిషేక్ రెడ్డి తీవ్ర అనారోగ్యంతో చనిపోయారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ తీసుకున్న అభిషేక్ రెడ్డి ఈ ఏడాది జనవరి తొలి వారంలో తుదిశ్వాస విడిచారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డి సోదరుడు వైఎస్ ప్రకాష్ రెడ్డి మనవడు వైఎస్ అభిషేక్‌రెడ్డి. ఇక డాక్టర్ అయిన వైఎస్ అభిషేక్ రెడ్డి.. వైద్యవృత్తిలో కొనసాగుతూనే వైఎస్సార్‌సీపీ వైద్య విభాగ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ఇక పులివెందుల నియోజకవర్గం లింగాల మండల వైఎస్సార్‌సీపీ ఇంఛార్జ్‌గా కూడా పనిచేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్ ప్రచారంలో వైఎస్ అభిషేక్ రెడ్డి కీలకపాత్ర పోషిస్తూ.. కడప జిల్లాలో పార్టీలో కీలకంగా వ్యవహరించారు. వైఎస్ జగన్ పాదయాత్రలోనూ అభిషేక్ రెడ్డి చాలా యాక్టివ్‌గా తిరిగారు.




## విశాఖ రైల్వేకు మహర్దశ

**రూ.299 కోట్లతో 6 కొత్త లైన్లు, ప్లాట్‌ఫారాలు**

వైజాగ్, జూలై 30 (ఈవార్తలు): విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పెరుగుతున్న రద్దీకి చెక్ పడనుంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రైళ్ల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రూ.299 కోట్లతో విశాఖ కోచింగ్ యార్డు ఆధునికీకరణకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో స్టేషన్ నిర్వహణ సామర్థ్యం పెరగడంతో పాటు రైళ్ల ఆలస్యం తగ్గే అవకాశం ఉంది. దక్షిణ కోస్ట్ రైల్వే పరిధిలోని విశాఖపట్నం కోచింగ్ యార్డును పూర్తిగా పునర్వ్యవస్థీకరించనున్నారు. ఇందులో ఆరు కొత్త లైన్లు, అదనపు ప్లాట్‌ఫారాలు నిర్మించనున్నారు. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఉన్న ఆరు ప్లాట్‌ఫారాలను కూడా విస్తరించనున్నారు. దీంతో యార్డులో రద్దీ తగ్గి రైళ్ల కదలిక మరింత వేగంగా సాగనుంది. ప్రస్తుతం విశాఖ రైల్వే స్టేషన్ నుంచి రోజూ సుమారు 80 వేల మంది ప్రయాణిస్తున్నారు. సగటున 113 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుత యార్డు నిర్మాణం కారణంగా టెర్మినేటింగ్ రైళ్లు, ఇతర రైళ్లు ఒకే మార్గాలను దాటాల్సి వస్తోంది. దీనివల్ల అప్రోచ్ సిగ్నళ్ల వద్ద రైళ్లు నిలిచిపోవడం, ప్లాట్‌ఫారాల లభ్యత తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త ప్రాజెక్టు పూర్తైతే ఈ సమస్యలు గణనీయంగా తగ్గనున్నాయి. రైళ్ల నిలిపివేత సమయం తగ్గుతుంది. ప్లాట్‌ఫారాల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. భవిష్యత్తులో మరిన్ని రైళ్లను నిర్వహించే వీలుంటుంది. తూర్పు వైపు కొత్త ప్రవేశ ద్వారం నిర్మించడంతో పాటు ప్రయాణికుల రిజర్వేషన్ కేంద్రాన్ని కూడా కొత్త ప్రదేశానికి తరలించనున్నారు.



# కుండతో కుమ్మరించినట్లే!

### తెలంగాణలో కుండపోత వానలు.. తీవ్ర వాయుగుండం ప్రభావం

**ఉత్తర తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు.. పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ హెచ్చరికలు**

**(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్-తెలంగాణ)**



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో వర్షాలు ఉద్ధృతంగా కొనసాగుతున్నాయి. గత 20 గంటలుగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తుండగా, రానున్న 36 గంటలు అత్యంత కీలకమని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవస్థ ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ వైపు కదులుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు జిల్లాల్లో కూడా భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 45 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో రోజంతా మేఘావృత వాతావరణం కొనసాగుతుందని, తేలికపాటి నుంచి మోస్తరు, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయే ప్రమాదం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. భారీ వర్షాల నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఐటీ సంస్థలు, ప్రైవేటు కంపెనీలకు కీలక సూచనలు జారీ చేశారు. ఉద్యోగులకు వీలైనంత వరకు ఇంటి నుంచే పని (వర్క్ ఫ్రం హోమ్) అవకాశం కల్పించాలని కోరారు. కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి విడతల వారీగా ముందుగానే విధులు ముగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్ ప్రాంతాల్లో సాయంత్రం తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**ఉత్తర తెలంగాణలో స్కూళ్లకు సెలవులు**

ఉత్తర తెలంగాణను కుండపోత వర్షాలు ముంచెత్తుతుండటంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో ప్రజల సాధారణ జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉత్తర తెలంగాణ జిల్లాల కలెక్టర్లు గురువారం అన్ని పాఠశాలలు, విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు జిల్లా కన్నాయిగూడెంలో అత్యధికంగా వర్షపాతం నమోదు కావడంతో అధికారులు వరద బాధితుల కోసం అత్యవసర పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే, మేడారంలో జంపన్న వాగు ఉగ్రరూపం దాల్చగా, స్నానానికి దిగిన ఘట్‌కేసర్‌కు చెందిన ఓ భక్తుడు నీటి ఉద్ధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. నదీ పరీవాహక, వాగుల ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.


**ఆగస్టులోనూ భారీ వర్షాలు!**

నైరుతి రుతుపవనాలు మరింత బలపడుతున్నాయి. ఇప్పట్లో బలహీనపడే సూచనలు కనిపించడం లేదని నిపుణులు అంటున్నారు. దీంతో ఆగ'ష్ట్రఓఅలో కూడా భారీ వర్షాలకు అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇంతకాలం సరైన వర్షాలు లేక అల్లాడిపోయిన రైతులకు తాజా వానలు ఉపశమనం కల్పిస్తున్నాయి. వరుసగా కురుస్తున్న వానల వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో వర్షపాత లోటు కూడా భారీగా తగ్గిపోయింది. ప్రస్తుతం దేశంలో వర్షపాతం లోటు 14 శాతానికి మాత్రమే చేరుకుంది. ఎగువన ఉన్న మహారాష్ట్రలో మేఘాలు భారీ స్థాయిలో వ్యాపించి ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో భారీ వర్షాలు నమోదవుతాయని వాతావరణశాఖ నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఆగ'ష్ట్రఓఱ మొదటి సగం మాత్రం భారీ వానలు తప్పవని చెబుతున్నారు. సెంట్రల్ ఇండియా, పశ్చిమ భారతంలోనూ వానలు పడుతాయి. ఇప్పటికే మహారాష్ట్రతోపాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో భారీ వర్షాలు కురుస్తుండగా.. ఇవి ఇంకొన్ని రోజులు ఇలాగే కొనసాగుతాయి. రాజస్థాన్, గుజరాత్‌లకు కూడా భారీ వర్షాలకు అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో భారీ వర్షాలకు చోటుండటం, రిజర్వాయర్లు నిండుతుండటం, నదులు జలకళ సంతరించుకోవడం వల్ల ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఐఎండీ నిపుణులు అంచనావేస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీతోపాటు ముంబై సహా అనేక చోట్ల భారీ వర్షాలు నమోదవుతున్న సంగతి తెలిసిందే.

## ఇంజినీర్లకు రేవంత్ సారీ చెప్పాలి: కేటీఆర్

హైదరాబాద్, జూలై 30 (ఈవార్తలు): తెలంగాణ యువ ఇంజినీర్ల ప్రతిభను ' క్రిమినల్ వేస్ట్' అంటూ అవమానించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారానికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆఱ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. వెంటనే యువ ఇంజినీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ యువత సామర్థ్యాన్ని కించపరిచేలా మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి ఏముందని ప్రశ్నించారు. తన జీవితంలో ఎప్పుడైనా ఒక పోటీ పరీక్ష రాశారా? ఏదైనా ఉద్యోగానికి ఇంటర్వ్యూకు హాజరయ్యారా? ఏదైనా వృత్తిపరమైన సంస్థలో పనిచేసిన అనుభవం ఉందా? అంటూ నిలదీశారు. రేవంత్ రెడ్డి గతాన్ని ప్రజలు మరచిపోలేదని, రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా ప్రారంభమైన ఆయన ప్రయాణం బ్లాక్‌మెయిల్ రాజకీయాల వరకు వెళ్లిందని విమర్శించారు. దివాలా తీసిన కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి పదవిని కొనుగోలు చేసి అధికారంలోకి వచ్చిన వ్యక్తి, దేశానికి సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లను అందిస్తున్న తెలంగాణ యువతను అవమానించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. తెలంగాణ యువత కృషి, ప్రతిభ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతుండగా, వారిని అవమానించే వ్యాఖ్యలను ముఖ్యమంత్రి వెంటనే ఉపసంహరించుకుని రాష్ట్ర యువతకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**టీచర్లను అవమానించేలా రేవంత్ వ్యాఖ్యలు: హరీశ్**



సీఎం రేవంత్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. చేసిందేమి లేదు కానీ ఇంజినీరింగ్ పిల్లలను క్రిమినల్ వేస్ట్ అని యావత్ ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానిస్తున్నారని ఫైర్ అయ్యారు. ఆ విద్యార్థులకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను అవమానపరిచే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆయనకు అసలేం మాట్లాడుతడో తెల్వదు. ఇంజనీరింగ్ చదివిన మన పిల్లలు ప్రపంచదేశాల్లో అద్భుతంగా రాణిస్తూ ఈ రాష్ట్రానికి తెలుగు ప్రజలకు పేరు తెస్తే ఆ పిల్లలను క్రిమినల్ వేస్ట్ అంటవా..? రేవంత్ రెడ్డి అని అడిగారు. నీ మైండ్ సరిగా లేదు.. ఆ మాటలు వెనక్కు తీసుకో. ఆ ఇంజనీరింగ్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాలని కోరుతున్నానన్నారు.

## సైమా అవార్డ్స్ నామినేషన్స్‌లో 'మిరాయ్' టాప్

హైదరాబాద్, జూలై 30 (ఈవార్తలు): దక్షిణాది చిత్ర పరిశ్రమలో ప్రతిష్ఠాత్మకంగా భావించే ' సైమా అవార్డ్స్ ' వేడుకకు రంగం సిద్ధమైంది. 'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్' వేడుక త్వరలో జరగనుంది. 2025 సంవత్సరంలో అత్యుత్తమ ప్రదర్శన కబరిచిన చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేసి అవార్డులు అందించనున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ సినిమాలకు వివిధ కేటగిరీల్లో పురస్కారాలు ఇవ్వనున్నారు. అత్యధిక నామినేషన్స్ దక్కించుకున్న చిత్రాల వివరాలను 'సైమా' అవార్డుల కమిటీ తాజాగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మారుతి సుజుకి నెక్సా 'సైమా అవార్డ్స్-2026' నామినేషన్స్‌లో 'మిరాయ్' మూవీ సత్తా చాటింది. వివిధ కేటగిరిల్లో ఏకంగా 11 నామినేషన్స్ దక్కించుకుని టాప్ లో నిలిచింది. తేజ సజ్జా, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఈ ఫాంటసీ అడ్వెంచర్ ఫిల్మ్ తెరకెక్కింది. పీపుల్స్ మీడియా నిర్మించింది. గతేడాది సెప్టెంబర్ లో రిలీజైన ఈ పాన్ ఇండియా మూవీ.. బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా రూ.140 కోట్లకు పైగా కలెక్షన్స్ సాధించింది. ఇప్పుడు సైమా నామినేషన్స్‌లో మెరిసింది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకి సైమా అవార్డ్స్ లో 10 నామి నేషన్స్ దక్కాయి. దగ్గుబాటి వెంకటేష్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మించిన ఈ సినిమా.. 2025 సంక్రాంతికి విడుదలై, బాక్సాఫీస్ దగ్గర బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. వరల్డ్ వైడ్ గా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది.

**రేవంత్.. యువతకు క్షమాపణ చెప్పు: ఈటల**

హైదరాబాద్, జూలై 30 (ఈవార్తలు): యువతకు సీఎంరేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు ఎంపీ ఈటల రాజేందర్. ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి నోటి నుండి వచ్చే మాటలు సమాజానికి దిశానిర్దేశం చేయాలి, కానీ సీఎం వ్యాఖ్యలు దురదృష్టకరం అంటూ ఫైర్ అయ్యారు. నిన్న కాక మొన్న.. జెన్ జీ యువత రాజకీయాల్లోకి రావాలని ఆకాశానికెత్తేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఇవాళ అదే యువతను, ఇంజినీరింగ్ విద్యార్థులను"క్రిమినల్ వేస్ట్" అని సంబోధించడం అత్యంత దుర్మార్గం, విచారకరం అన్నారు. ఇదేనా యువతకు మీరిచ్చే గౌరవం ? అంటూ నిలదీశారు. మీకు ఓట్లేసి గెలిపించడానికి యువత కావాలి.. అప్పుడు వారు "జెన్ జీ" ఐకాన్లు! కానీ, అధికారంలోకి వచ్చాక వారు మీకు "క్రిమినల్ వేస్ట్" లా కనిపిస్తున్నారా ? అంటూ నిప్పులు చెరిగారు. ఓ యువత.. మేల్కొనండి! ఈ ద్వంద్వ వైఖరిని గమనించండని కోరారు.


**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!


*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## ఇంటర్నెట్ లేకున్నా..

**మలక్‌పేట్ టీవీ టవర్ నుంచి ఫ్రీ టీవీ ఛానళ్లు**



మలక్‌పేట-హైదరాబాద్, జూలై 30 (ఈవార్తలు): హైదరాబాద్‌కు ఒకప్పుడు గుర్తింపుగా నిలిచిన మలక్‌పేట్ టీవీ టవర్ సరికొత్త టెక్నాలజీతో కొత్త బాధ్యతలు చేపట్టేందుకు రెడీ అవుతోంది. ఇంటర్నెట్ లేదా నెలవారీ సబ్‌స్క్రిప్షన్ అవసరం లేకుండానే నేరుగా స్మార్ట్‌ఫోన్‌లలో టీవీ ఛానళ్లను వీక్షించే విధానాన్ని అమలు చేసేందుకు ఈ మలక్‌పేట్ టీవీ టవర్‌ను డిజిటల్ మొబైల్ బ్రాడ్‌కాస్టింగ్ కేంద్రంగా మారుస్తున్నారు. ప్రస్తుతం ఈ టెక్నాలజీ వ్యవస్థపై ప్రయోగాత్మక పరీక్షలు జరుపుతున్నారు. ఈ పరీక్షలు సక్సెస్ అయితే వచ్చే ఏడాదిలోనే హైదరాబాద్ ప్రజలకు ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని దూరదర్శన్ కేంద్రం హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎన్‌వీ రమణ తెలిపారు. ఈ మొబైల్‌లో వచ్చే ఛానళ్లు పూర్తిగా ఉచితంగా ఉండే అవకాశాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఈ కొత్త విధానంలో టీవీ ఛానళ్లు ఇంటర్నెట్ ఆధారంగా కాకుండా నేరుగా ప్రసార సంకేతాల రూపంలో మొబైల్ ఫోన్లకు చేరతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. స్టూడియో నుంచి శాటిలైట్‌కు పంపించిన సిగ్నల్‌ను మలక్‌పేట్ టీవీ టవర్ స్వీకరించి.. అక్కడి నుంచి శక్తివంతమైన ట్రాన్స్‌మిటర్ల ద్వారా సుమారు 60 కిలోమీటర్ల పరిధిలోని మొబైల్ ఫోన్లకు ప్రసారం చేయనున్నారని.. కస్టమర్లు ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా ఈ ఛానళ్లను వీక్షించవచ్చని పేర్కొన్నాయి. మొదటి దశలో దూరదర్శన్‌కు చెందిన డీడీ యాదగిరి, డీడీ సప్తగిరి, డీడీ నేషనల్, డీడీ న్యూస్, డీడీ స్పోర్ట్స్‌తో పాటు ఇతర ప్రాంతీయ ఛానళ్లను అందుబాటులోకి తీసుకురానున్నారు.

## రూ.368 కోట్లతో 2 స్టీల్ ఫ్లైఓవర్లు, ఒక అండర్‌పాస్

హైదరాబాద్, జూలై 30 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే నగరంలో ఎన్నో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, స్కైవేలు నిర్మించిన ప్రభుత్వం.. తాజాగా మరో రెండు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. బంజారాహిల్స్ ప్రాంతంలోని అత్యంత రద్దీగా ఉండే ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్, టీవీ9 జంక్షన్ వద్ద రెండు స్టీల్ ఫ్లైఓవర్లు, ఒక అండర్‌పాస్ నిర్మాణానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. మొత్తం రూ.368 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్ సిటీ ప్రాజెక్టు కింద ఈ పనులు చేపట్టనుండగా.. హైదరాబాద్ నగరంలో సిగ్నల్‌రహిత ప్రయాణాన్ని విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3 నుంచి జీవీకే మాల్ వైపు రూ.147 కోట్లతో రెండు లేన్ల వన్‌వే స్టీల్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు.

# వేములవాడను ముంచెత్తిన వానలు

## మూలవాగు ఉప్పొంగి ప్రవాహం.. నక్కవాగు పరవళ్లు.. దెబ్బతిన్న రహదారులు

రాజన్న సిరిసిల్ల బ్యూరో/వేములవాడ అర్బన్, జూలై 30 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడను గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ముంచెత్తుతున్నాయి. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురవడంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే ఈ వర్షాలు రైతుల్లో కొత్త ఆశలు నింపాయి. వేములవాడ పట్టణంలో 49.9 మిల్లీమీటర్లు, వేములవాడ గ్రామీణ మండలంలో 53.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మూలవాగు ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా సాధారణ జనజీవనం కొంత మేర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, సాగు పనులకు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన వర్షాలు లేక ఆందోళన చెందిన రైతాంగానికి ఈ వర్షాలు ఊరటనిచ్చాయి. వాడిపోతున్న పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు చెబుతున్నారు. వేములవాడ గ్రామీణ మండలంలోని హనుమాజీపేట నక్కవాగు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగులు, వంకలు, ఒర్రెలు పొంగిపొర్లుతుండటంతో మండలమంతా జలకళ సంతరించుకుంది. భూగర్భ జలమట్టం పెరిగి రాబోయే రోజుల్లో సాగునీటి సమస్య తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూలవాగు ఉప్పొంగి ప్రవహించడంతో కోనరావుపేట మండలం మామిడిపల్లి--నిజామాబాద్ గ్రామాల మధ్య రహదారి కొట్టుకుపోయింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతోందని, శాశ్వత వంతెన నిర్మించాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రమాదాలు నివారించేందుకు గ్రామపంచాయతీ అధికారులు వాటర్ ట్యాంకర్‌ను అడ్డంగా ఉంచి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.



భారీ వర్షాల ప్రభావంతో సిరిసిల్ల పెద్దబజార్ హనుమాన్ ఆలయం సమీపంలో ఓ భారీ వృక్షం రోడ్డుపై కూలిపోయింది. చెట్టుతో పాటు హైటెన్షన్ విద్యుత్ తీగలు తెగిపడటంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డుపై వెళ్తున్న ఓ ఓమ్ని వ్యాన్, సరుకు వాహనంపై చెట్టు పడటంతో రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. వ్యాన్ డ్రైవర్ గాయపడగా, స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ శాఖ, పురపాలక సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి చెట్టును తొలగించే పనులు చేపట్టారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అవసరం లేకుండా వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా పశువుల కాపరులు, గ్రామీణులు ప్రవాహ ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# వేములవాడలో వైభవంగా వరుణయాగం ప్రారంభం

## సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు.. లోకకల్యాణం మంత్రులు, ప్రజాప్రతినిధుల ప్రార్థనలు



వేములవాడ అర్బన్, జూలై 30 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లోకకళ్యాణం, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలనే సంకల్పంతో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వరుణయాగం గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మహేష్ బి. గితే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన అతిథులకు ప్రధాన అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదాశీర్వచనాలు అందించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అతిథులకు అందజేశారు. జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు సత్వర సద్యఃసువృష్టి (సకాల వర్షప్రాప్తి) కోసం ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహించనున్నారు. మొదటి రోజు స్వస్తి పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణ జపాలు, వరుణయాగ హోమం, సంతత ధారాభిషేకం, జపానుష్ఠానాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం పరివార, అనుబంధ ఆలయాల్లో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, విరాటపర్వ పారాయణాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు కూడా కొనసాగనున్నాయి. యాగశాలలో వరుణయాగాన్ని అధికారికంగా ప్రారంభించిన అనంతరం, భీమేశ్వర సదన్ ఈశాన్య భాగంలో వర్షపు నీటి సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ వరుణయాగం కేవలం ఆధ్యాత్మిక క్రతువు మాత్రమే కాదని, లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించే మహోన్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు. సకాలంలో వర్షాలు కురిస్తే చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోవడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి రైతులకు సాగునీటి కొరత తీరుతుందని, వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, తెలంగాణ సస్యశ్యామలంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ ఈ వరుణయాగాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, దేవస్థానం అధికారులు, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఉద్యోగులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభం**

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం గుడి చెరువులో రూ.12 కోట్ల వ్యయంతో చేపట్టిన బండ్ పార్క్ అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మహేష్ బి. గితేతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు బండ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన 40 అడుగుల ఎత్తైన శివుడి విగ్రహం, నటరాజ స్వామి విగ్రహం, సప్తమాతృకల విగ్రహాలు, సుందర ఉద్యానవనం, అలంకార మొక్కలను పరిశీలించారు. ఈ అభివృద్ధి పనులతో గుడి చెరువు పరిసరాలు మరింత ఆకర్షణీయంగా మారాయని వారు పేర్కొన్నారు. అటు.. వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు రూ.1.65 కోట్లతో మంత్రులు, ప్రభుత్వ విప్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, బస్టాండ్ పునర్నిర్మాణంతో వేములవాడకు వచ్చే భక్తులు, యాత్రికులకు ఆధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. బస్టాండ్ సుందరీకరణతో పాటు ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించనున్నట్లు చెప్పారు.

# 48 గంటలు అప్రమత్తంగా ఉండాలి

**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

జగిత్యాల, జూలై 30 (ఈవార్తలు): రానున్న 48 గంటల పాటు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల పరిస్థితులను, ముందస్తు ఏర్పాట్లను పరిశీలించేందుకు గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ జగిత్యాల మున్సిపల్ పరిధిలోని శాలిమ గార్డెన్ కలపల్లి చెరువు వద్ద పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాల ప్రభావం, సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని కలెక్టర్ సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు లేదా ప్రమాదాలు చోటుచేసుకున్నా వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కోరారు. రెడ్ అలర్ట్ కొనసాగుతున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు వచ్చే 48 గంటల పాటు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సర్పంచులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు తదితర స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ పర్యటనలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సామీల వాణి, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వోతో పాటు 16 వార్డ్ కౌన్సిలర్ దుమల రాజ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో మూడు ప్రత్యేక రెస్క్యూ బృందాలు: ఎస్పీ

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు జిల్లా పోలీసు శాఖ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. వాగులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన మూడు రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచామని ఎస్పీ తెలిపారు. ఈ బృందాలకు లైఫ్ జాకెట్లు, తాళ్లు, రెస్క్యూ కిట్లు తదితర భద్రతా పరికరాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. అవసరమైతే వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక చర్యలు చేపడతామని వెల్లడించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, వంకలు, వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్--100కు సమాచారం అందించాలని ఎస్పీ అశోక్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

**శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థి మండలి ప్రమాణ స్వీకారం**

హయత్‌నగర్, జూలై 30 (ఈవార్తలు): విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలు, విలువలను పెంపొందించుకుని సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని శ్రీ చైతన్య పాఠశాల దిల్‌సుఖ్‌నగర్ మండల ఏజీఎం వెంకట్ రెడ్డి సూచించారు. హయత్‌నగర్ పరిధిలోని సాయినగర్ శాఖ శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం విద్యార్థి మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ బాయ్, హెడ్ గర్ల్, ఉప కెప్టెన్లు, హౌస్ కెప్టెన్లు తదితర బాధ్యతలను స్వీకరించిన విద్యార్థులు నిజాయితీ, సేవాభావంతో తమ బాధ్యతలను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, నాయకత్వం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని, చదువుతో పాటు బాధ్యతాయుతమైన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, సేవా దృక్పథం, సమిష్టి భావనతో ముందుకు సాగాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంజనీదేవి మాట్లాడుతూ, నాయకత్వం అనేది హోదా కాదని, బాధ్యత అని విద్యార్థులు గుర్తుంచుకోవాలని అన్నారు. సమయపాలన, క్రమశిక్షణ, సేవా భావంతో పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త రఘువంశీ, శారీరక విద్య ఉపాధ్యాయుడు అనిల్, మండల ఇన్‌చార్జి శారీరక విద్య ఉపాధ్యాయుడు అయోధ్య, డీన్ రఘుపతి, సి బ్యాచ్ ఇన్‌చార్జి సోమయ్య, పరిపాలనాధికారి ప్రమోద్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# గిరిప్రదక్షిణ కాదు.. గుడి సంగతి చూడండి

**పొన్నంకు జనసేన నేత బండారి రాజ్ కుమార్ డిమాండ్**

మల్యాల, జూలై 30 (ఈవార్తలు): జనసేన కరీంనగర్ నాయకుడు డా. బండారి రాజ్‌కుమార్ గురువారం శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించిన ఆయన, జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజాసేవలో మరింత విజయవంతం కావాలని స్వామివారిని వేడుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన డా. రాజ్‌కుమార్, ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ కొండగట్టు ఆలయాన్ని సందర్శించడం స్వాగతించదగిన విషయమేనని, అయితే భక్తులు ఆశించింది గిరిప్రదక్షిణ వార్తలు కాదని, కొండగట్టు అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ అని అన్నారు. పార్కింగ్, భక్తుల వసతి గృహాలు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, రహదారులు, పరిశుభ్రత, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తుందని ఆశించామని, కానీ ఆ అంశాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం భక్తులను, అర్చకులను, స్థానిక ప్రజలను నిరాశకు గురి చేసిందని పేర్కొన్నారు. అలాగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ను "చెల్లింపు కళాకారుడు"గా సంబోధించడం రాజకీయ హుందాతనానికి తగదని విమర్శించారు. వ్యక్తిగత విమర్శలకు బదులుగా కొండగట్టును దేశంలోనే ఆదర్శ ఆధ్యాత్మిక--పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం విజన్ చూపాలని సూచించారు. "చెల్లింపు కళాకారుడి గురించి కాదు... అభివృద్ధి చెందిన కొండగట్టు గురించి మాట్లాడాలి. విమర్శలు కాదు... అభివృద్ధి కార్యాచరణను ప్రజలు గుర్తుంచుకుంటారు" అని డా. రాజ్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మహిళా నాయకురాలు డా. సాయి కృష్ణ ప్రియ, నాయకురాలు రాజిత, చొప్పదండి జనసేన నాయకులు మొగిలిపాక రమేష్, శ్రీనాథ్తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగార్థులకు ఆర్థిక సహాయం

**గ్రామ పంచాయతీ తరఫున అండగా ఉంటాం**

**గుడిపేట సర్పంచ్ ఇట్టిరెడ్డి శ్వేత**

మల్యాల, జూలై 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం గుడిపేట గ్రామానికి చెందిన యువత పోలీసు ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకుని కృషి చేయాలని, వారికి అవసరమైన మార్గదర్శకత్వంతో పాటు ఆర్థిక సహాయాన్ని కూడా గ్రామ పంచాయతీ తరఫున అందిస్తామని గుడిపేట సర్పంచ్ ఇట్టిరెడ్డి శ్వేత తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఆసక్తి కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇప్పటి నుంచే క్రమశిక్షణతో సన్నద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోకూడదనే ఉద్దేశంతో, శారీరక శిక్షణ, పోటీ పరీక్షల సన్నాహకానికి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు గ్రామ పంచాయతీ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. పట్టుదలతో శ్రమిస్తే పోలీసు శాఖలో ఉద్యోగం సాధించడం సాధ్యమేనని, గ్రామ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ సేవలో చేరాలని సర్పంచ్ ఇట్టిరెడ్డి శ్వేత ఆకాంక్షించారు.


# కూలిన చెట్ల తొలగింపులో పోలీసుల చొరవ

**బుగ్గారం, పెగడపల్లి, కొండగట్టులో చెట్లు తొలగింపు**

మల్యాల/పెగడపల్లి/బుగ్గారం, జూలై 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలుచోట్ల రహదారులపై చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే జగిత్యాల జిల్లా పోలీసులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను యథావిధిగా పునరుద్ధరించారు. బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగాపూర్ గ్రామంలో రహదారిపై చెట్టు కూలిపోవడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెట్టును తొలగించి వాహనాల రాకపోకలకు మార్గాన్ని క్లియర్ చేశారు. పెగడపల్లి-రామడుగు ప్రధాన రహదారిపై భారీ చెట్టు కూలిపోవడంతో బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అలాగే కొండగట్టు మండలం రాజారం గ్రామ సమీపంలోని హైవే రహదారిపై రెండు చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సంబంధిత శాఖల సిబ్బందితో కలిసి చెట్లను తొలగించి హైవేను పూర్తిగా క్లియర్ చేశారు. భారీ వర్షాల సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని, రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు లేదా ఇతర అడ్డంకులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై కొండగట్టు సమీపంలోని మెహర్ బాబా టెంపుల్ ఎదురుగా గురువారం రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షం ఒక్కసారిగా విరిగి రోడ్డుపై వెళ్తున్న రెండు వాహనాలపై పడింది. ఈ ఘటనలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. వృక్షం రోడ్డుపై పడటంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు, సంబంధిత శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని చెట్టును తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

# ఎల్లంపల్లి-కాళేశ్వరం తేడా తెల్వదు: మంత్రి మహేందర్

చొప్పదండి, జూలై 30 (ఈవార్తలు): ఎల్లంపల్లి, కాళేశ్వరం ప్రాజెక్టులపై అవగాహన లేకుండానే బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంత్రి మహేందర్ ఆరోపించారు. గంగాధరలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రూపకల్పన జరిగిందని, కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభానికి ముందే ఎల్లంపల్లి నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును భారీ వ్యయంతో నిర్మించి రాష్ట్రంపై అదనపు విద్యుత్ భారం మోపారని విమర్శించారు. కొండగట్టు ఆంజనేయస్వామి ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేపట్టిన గిరి ప్రదక్షిణ విజయవంతమైందన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నాయకులు నిరాధార విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

**తక్షణమే తొలగించాలని ప్రజల డిమాండ్**

మల్యాల, జూలై 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని అంగడి బజార్ ప్రాంతంలో ప్రమాదకర స్థితిలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం స్థానికుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వర్షాకాలం నేపథ్యంలో స్తంభానికి విద్యుత్ లీకేజీ జరిగే ప్రమాదం ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రద్దీగా ఉండే అంగడి బజార్‌లో ప్రతిరోజూ పాదచారులు, విద్యార్థులు, వ్యాపారులు, వాహనదారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో దెబ్బతిన్న ఇనుప విద్యుత్ స్తంభం ఉండటం వల్ల ఎలాంటి అవాంఛనీయ ఘటన జరిగినా తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తరువాత స్పందించడం కంటే, ముందస్తుగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. పాత ఇనుప స్తంభాన్ని వెంటనే తొలగించి, దాని స్థానంలో కొత్త, సురక్షితమైన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మిషన్-80 పోస్టర్ ఆవిష్కరించిన స్పీకర్

హైదరాబాద్, జూలై 30 (ఈవార్తలు): భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "మిషన్-80" ప్రపంచ రికార్డు ప్రయత్నం పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తన కార్యాలయంలో గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. కరాటే రంగంలో విశేష సేవలందిస్తున్న వి. సుధాకర్ చేపట్టనున్న ఈ వినూత్న ప్రపంచ రికార్డు ప్రయత్నం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా గర్వకారణమని పేర్కొన్నారు. సుధాకర్ విజయవంతంగా ప్రపంచ రికార్డు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. 09 ఆగస్టు 2026న ఉదయం 9 గంటలకు హైదరాబాద్, నారాయణగూడ లోని డా. జి.ఎస్. మెల్కోటే పార్క్ లో జరగనున్న ఈ కార్యక్రమంలో వి. సుధాకర్ కేవలం 8 నిమిషాల్లో 9 రకాల కరాటే బాడీ టెక్నిక్స్ ఉపయోగించి 80 షాబాద్ టైల్స్‌ను బద్దలు కొట్టి ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు సిద్ధమవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రపంచ రికార్డు ప్రయత్నం భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నివాళిగా, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్న గౌడ్, జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డా. జి.ఎస్. గోపాల్ రెడ్డి, ప్రపంచ రికార్డు ప్రయత్నకర్త వి. సుధాకర్, అమృత రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, క్రీడాభిమానులు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ చారిత్రాత్మక ప్రపంచ రికార్డు ప్రయత్నాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.



# రామమందిర ట్రస్ట్ తొలి కార్యదర్శిగా జగదీశ్ అఫాలే

అయోధ్య: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు తొలి కార్యదర్శిగా ఐఐటీ బాంబే పూర్వ విద్యార్థి జగదీశ్ అఫాలేను నియమించారు. ఆలయ పరిపాలనతో పాటు ఆర్థిక లావాదేవీల్లోనూ కీలక బాధ్యతలు అప్పగించారు. ఇదే సమయంలో రామమందిర విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వం, ట్రస్ట్‌ను ప్రశ్నించాయి. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశాయి. జగదీశ్ అఫాలేను ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలకు సంయుక్త అధికారిగా కూడా నియమించినట్లు సమాచారం. రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగ ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో అక్రమాలు జరగకుండా ఈ నియామకం ఎలా ఉపయోగపడుతుందో ట్రస్ట్ వివరించాలని సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి అశుతోష్ వర్మ కోరారు. చంపత్‌రాయ్‌పై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదన్న ప్రశ్నకు కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ కూడా ట్రస్ట్‌పై విమర్శలు చేశారు. పవిత్ర లక్ష్యంతో ఏర్పాటైన ట్రస్ట్‌లో అవినీతి ఆరోపణలు రావడం బాధాకరమన్నారు. ట్రస్ట్‌ను పునర్వ్యవస్థీకరించి శంకరాచార్యులు సహా ప్రముఖ సన్యాసుల ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. అయోధ్య ప్రజలకు శ్రీరాముడితో చారిత్రక అనుబంధం ఉందని, వారికీ ట్రస్ట్‌లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.




## 'ఈ-విటారా' ఉత్పత్తి షురూ

**గుజరాత్‌లోని హన్సల్‌పూర్‌లో ప్రారంభించిన మారుతి**

అహ్మదాబాద్: ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) మరో చారిత్రక మైలురాయిని అందుకుంది. గుజరాత్‌లోని హన్సల్‌పూర్‌లో తన నాలుగో తయారీ ప్లాంట్‌లో వాణిజ్య ఉత్పత్తిని ఇవాళ ప్రారంభించింది. దీంతో ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 10 లక్షల వాహనాలకు చేరి, దేశంలోనే ఒకేచోట ఉన్న అతిపెద్ద ప్యాసింజర్ వాహన తయారీ కేంద్రంగా అవతరించింది. గతంలో 7.5 లక్షల యూనిట్ల సామర్థ్యంతో ఉన్న ఈ ప్లాంట్, కొత్త ప్లాంట్-డి ప్రారంభంతో ఇప్పుడు 10 లక్షల యూనిట్లకు విస్తరించింది. హన్సల్‌పూర్ ప్లాంట్‌పై కంపెనీ ఇప్పటివరకు రూ. 25,288.7 కోట్లు పెట్టుబడి పెట్టగా, ఇందులో కొత్తగా ప్రారంభించిన ప్లాంట్‌పైనే సుమారు రూ. 3,900 కోట్లు ఖర్చు చేసింది. ప్రపంచవ్యాప్తంగా సుజుకి తయారీ కేంద్రాల్లో ఒకేచోట 10 లక్షల వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించిన తొలి ప్లాంట్‌గా కూడా ఇది నిలిచింది. ఈ విస్తరణతో మారుతి సుజుకి మొత్తం తయారీ సామర్థ్యం ఏటా 29 లక్షల యూనిట్లకు పెరిగింది. ఈ కొత్త ప్లాంట్‌లో మారుతి తన ఫ్లాగ్‌షిప్ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం (బీఈవీ) 'ఇ-విటారా'ను తొలుత తయారు చేయనుంది. దీని ద్వారా కంపెనీ ప్యాసింజర్ ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి అధికారికంగా ప్రవేశిస్తోంది. ప్రస్తుతం హన్సల్‌పూర్ ప్లాంట్‌లో ఫ్రాంక్స్, బాలెనో, స్విఫ్ట్ వంటి ప్రముఖ మోడళ్లను ఉత్పత్తి చేస్తున్నారు.



## ఇకపై పతంజలి పాలసీలు

**రూ.4,500 కోట్లతో మాగ్మా కంపెనీ కొనుగోలు**

న్యూఢిల్లీ: పతంజలి టూత్‌పేస్ట్, నెయ్యి, ఫేస్‌వాష్ వంటి ఉత్పత్తులను మీరు కొనే ఉంటారు. కానీ త్వరలోనే పతంజలి ఇన్సూరెన్స్ పాలసీని కూడా కొనుగోలు చేసే అవకాశం రాబోతోంది. యోగా గురువు బాబా రాందేవ్‌కు చెందిన పతంజలి ఆయుర్వేద్ సంస్థ, ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ), ఆయుర్వేద రంగాల నుంచి ఆర్థిక సేవల రంగంలోకి అతిపెద్ద అడుగు వేసింది. మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని కొనుగోలు చేసేందుకు పతంజలికి ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 4,500 కోట్ల విలువైన ఈ కొనుగోలును పతంజలి.. ఆహార, మిఠాయి ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందిన డీఎస్ గ్రూప్‌తో కలిసి సంయుక్తంగా చేపడుతోంది. ఈ ఒప్పందం ప్రకారం, మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో పతంజలి 73.56 శాతం వాటాను, డీఎస్ గ్రూప్ 24.5 శాతం వాటాను సొంతం చేసుకుంటాయి. ప్రస్తుత వాటాదారులైన అదార్ పూనావాలా గ్రూప్‌కు చెందిన సనోటి ప్రాపర్టీస్ ఎల్ఎల్‌పి నుంచి దాదాపు 98 శాతం వాటాను ఈ రెండు సంస్థలు కొనుగోలు చేయనున్నాయి. ఐఆర్‌డీఏఐ ఆమోదం మూడు నెలల పాటు చెల్లుబాటులో ఉంటుంది. ఈలోగా ఈ లావాదేవీని పూర్తి చేయాల్సి ఉంటుంది.

# పీఓకే దమనకాండపై బ్రిటన్ ఫైర్



లండన్: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో చెలరేగిన హింసపై అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నిరసనకారులపై పాకిస్థాన్ భద్రతా బలగాలు జరిపిన దమనకాండలో 40 మందికి పైగా పౌరులు మరణించగా, డజన్ల కొద్దీ ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై పలువురు బ్రిటిష్ పార్లమెంటేరియన్లు, మానవ హక్కుల సంస్థలు తీవ్రంగా స్పందించాయి. బ్రిటిష్ లేబర్ పార్టీ ఎంపీ లియామ్ బైర్న్ మాట్లాడుతూ.. పీఓకేలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై కాల్పులు జరపడం అత్యంత ఆందోళనకరమని అన్నారు. కమ్యూనికేషన్లపై నిషేధం విధించడం, మానవ హక్కులను ఉల్లంఘించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఈ హింసను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ లండన్‌లోని పాకిస్థాన్ హైకమిషన్‌తో చర్చలు జరపాలని, పాక్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తమ విదేశాంగ శాఖను కోరనున్నట్లు తెలిపారు. ఉద్రిక్తతలను తగ్గించి, కశ్మీరీల హక్కులను గౌరవించాలని ఆయన డిమాండ్ చేశారు. మరో బ్రిటిష్ ఎంపీ అద్నాన్ హుస్సేన్ ఈ ఘటనను ఒక 'విషాదం'గా అభివర్ణించారు. పాక్ బలగాలు పరిమితికి మించి బలప్రయోగం చేసిన ఘటనపై పూర్తిస్థాయి, స్వతంత్ర, పారదర్శక విచారణ జరగాలని కోరారు. ప్రముఖ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా పాకిస్థాన్ తీరును తీవ్రంగా విమర్శించింది. నిరసనకారులపై పాక్ చాలా కాలంగా అనుసరిస్తున్న అక్రమ హింసా విధానానికి ఈ ఘటనే నిదర్శనమని ఆమ్నెస్టీ సెక్రటరీ జనరల్ ఆగ్నెస్ కాలమర్డ్ అన్నారు. పీఓకేలో ఇంటర్నెట్, మొబైల్ సేవలపై నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని, మీడియాను, స్వతంత్ర పరిశీలకులను అనుమతించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆమె 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# పేపర్ లీక్ పరిష్కారమే నా పని: రాఘవ్ చద్దా

న్యూఢిల్లీ: నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వివాదంపై ఇప్పటివరకు తాను ఎందుకు మౌనంగా ఉన్నానో రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా గురువారం వివరణ ఇచ్చారు. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన బాధ్యతలో మార్పు వచ్చిందని, ప్రస్తుతం తాను పరిష్కార మార్గాలను సూచించే స్థానంలో ఉన్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నీట్ పేపర్ లీకేజీపై రాఘవ్ చద్దా ఎందుకు మౌనంగా ఉన్నారంటూ చాలామంది ప్రశ్నించారు. గతంలో నేను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని నిలదీయడం నా బాధ్యతగా భావించి, దానిని చిత్తశుద్ధితో నిర్వహించాను. అయితే ఇప్పుడు నా బాధ్యత కేవలం ప్రశ్నలు వేయడమే కాదు, సమస్యకు సరైన పరిష్కారాలను చూపడం. అందుకే ఈ సమస్యకు ఒక నిర్మాణాత్మక పరిష్కారంతోనే ప్రజల ముందుకు రావాలని నిర్ణయించుకున్నాను. ఆ సమయం నేడు ఆసన్నమైంది" అని వివరించారు. పేపర్ లీకేజీలను ఒక తీవ్రమైన రుగ్మతతో పోల్చిన చద్దా, కేవలం మీడియా ప్రకటనల ద్వారా కాకుండా, వ్యవస్థాగత మార్పుల ద్వారానే దీనిని అరికట్టగలమని అభిప్రాయపడ్డారు. పరీక్షలలో అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును ఒక సమగ్రమైన విధానంగా ఆయన అభివర్ణించారు. సత్వర దర్యాప్తు, ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, భవిష్యత్తులో నీట్ పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించడం వంటి కీలక చర్యలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

## తమిళనాడుకు నీళ్లివ్వాల్సిందే

**కావేరీ జలాలపై కర్ణాటకకు షాక్**




న్యూఢిల్లీ: కావేరీ నదీ జలాల వివాదంలో కర్ణాటకకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. తమిళనాడుకు రెండు వారాల పాటు రోజుకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరీ జల నియంత్రణ కమిటీ చేసిన సిఫార్సును కావేరీ జల నిర్వహణ అథారిటీ సమర్థించింది. ఈ ఉత్తర్వులు జులై 29 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. 15 రోజుల పాటు రోజుకు 7 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వం చేసిన డిమాండ్‌ను తోసిపుచ్చిన కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ.. రెగ్యులేషన్ కమిటీ సిఫార్సు చేసిన రోజుకు 3,500 క్యూసెక్కుల విడుదలకు ఆమోదం తెలిపింది. తమ సొంత అవసరాల కారణంగా నీటిని విడుదల చేసే స్థితిలో లేమని కర్ణాటక చేసిన వాదనను కూడా తోసిపుచ్చింది. ఈ 15 రోజుల వ్యవధిలో కర్ణాటక నుంచి మొత్తం 9 టీఎంసీల (వెయ్యి మిలియన్ క్యూబిక్ ఫీట్ల) నీటిని విడుదల చేయాలని తమిళనాడు ఒత్తిడి చేసింది. కావేరీ వాటర్ అథారిటీ ఉత్తర్వులు అమల్లోకి రావడంతో, కర్ణాటకకు ఉన్న తదుపరి చట్టపరమైన మార్గం సుప్రీంకోర్టును ఆశ్రయించడమేనని నిపుణులు తెలిపారు.

## యుద్ధఖైదీలపై రష్యా లైంగిక హింస

న్యూయార్క్: ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలు, పౌరులపై లైంగిక హింసను ఒక క్రమబద్ధమైన ఆయుధంగా రష్యా దళాలు ఉపయోగిస్తున్నాయని వాల్‌స్ట్రీట్ జర్నల్ సంచలన నివేదిక వెల్లడించింది. సైనికులు, పౌరుల సహా బాధితులను మానసికంగా దెబ్బతీయడం, అవమానించడమే లక్ష్యంగా అత్యాచారాలు, వారి ప్రయివేట్ భాగాలను విచ్ఛిన్నం చేయడం వంటి దారుణాలకు పాల్పడుతున్నారని నివేదిక పేర్కొంది. ఐక్యరాజ్యసమితి విచారణాధికారులు, ఉక్రెయిన్ ప్రాసిక్యూటర్లు, బాధితుల వాంగ్మూలాల ఆధారంగా ఈ నివేదికను వాల్‌స్ట్రీట్ జర్నల్ రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం.. ఫిబ్రవరి 2022లో పూర్తిస్థాయి దురాక్రమణ ప్రారంభమైనప్పటి నుంచి రష్యా సైన్యాలు ప్రధానంగా ఉక్రెయిన్‌కు చెందిన యుద్ధ ఖైదీలు ముఖ్యంగా పురుషులపైనే ఈ రకమైన లైంగిక చిత్రహింసలను ఎక్కువగా ప్రయోగించాయి. సెర్హి బోయ్‌చుక్ అనే ఉక్రెయిన్ మాజీ యుద్ధ ఖైదీ వాల్‌స్ట్రీట్ జర్నల్‌తో మాట్లాడుతూ.. తనను రష్యా సైనికులు 2022లో నిర్బంధించారని తెలిపాడు.

## నేడు కలెక్టరేట్ల వద్ద విద్యార్థుల మహార్యాలీ

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం**

హైదరాబాద్, జూలై 30 (ఈవార్తలు): విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31వ తేదీన శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లు, ఆర్డీఓ, మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద విద్యార్థుల మహా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, బీసీ జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుజ్జ సత్యం తెలిపారు. గురువారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఇచ్చిన పిలుపు మేరకు మహా ర్యాలీల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థల యాజమాన్యాలు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 14లక్షల మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని, పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు అడుగుతున్నది దానం కాదని, ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని మాత్రమేనని ఆయన పేర్కొన్నారు.

## 114 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కోరుట్ల, జూలై 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కోరుట్ల పట్టణానికి చెందిన 114 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1,14,13,224 (ఒక కోటి 14 లక్షల 13 వేల 224 రూపాయలు) విలువైన కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

**- పీఐబీ ఏడీజీ శ్రీమతి శృతి పాటిల్**
**- పీఐబీ ఆధ్వర్యంలో 'వార్త' వర్క్‌షాప్**
**- హాజరైన కేంద్ర ప్రభుత్వ విభాగాల అధికారులు**

హైదరాబాద్, జూలై 30 (పీఐబీ): కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలపై గురువారం కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో పీఐబీ 'వార్త' వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ(ఐఎంపీసీసీ)లో భాగంగా ఉన్న వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ)లకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. తమ శాఖల పరిధిలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను, గత 12 సంవత్సరాల్లో సాధించిన ముఖ్య విజయాలను వివరించారు. ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరువయ్యేందుకు భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలు, మీడియా ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై వారు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పీఐబీ విధులు, కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపడుతున్న కార్యక్రమాల గురించి అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ప్రచార కార్యక్రమాలపై సహకారం అందించేందుకు పీఐబీ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, పథకాలను ఎక్కువ మంది ప్రజలకు చేరువ చేసి, వారు లబ్ధి పొందేలా చూడటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉన్నతాధికారులు, పీఐబీ, సీబీసీ అధికారులు పాల్గొన్నారు.



## ప్రమాదకర మట్టిగోడల తొలగింపు

**వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు వేగవంతం**

**జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్**

జగిత్యాల టౌన్, జూలై 30 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని 46వ వార్డులో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పాత మట్టి గోడ ప్రమాదకరంగా మారి స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నట్లు, అలాగే ఒక ఇంటి పైకప్పు దెబ్బతిన్నట్లు స్థానిక కౌన్సిలర్ అనీస్ ఖుతీజా (అహ్మద్).. మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వెంటనే ఆమె, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, మున్సిపల్ అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న పాత మట్టి గోడను జేసీబీ సహాయంతో వెంటనే తొలగించి ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టారు. అనంతరం వర్షాల కారణంగా ఇంటి పైకప్పు దెబ్బతిన్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అందించాల్సిన సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాత గోడలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, నీటి నిల్వలు లేదా ఇతర ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే జగిత్యాల మున్సిపాలిటీకి సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు జగిత్యాల మున్సిపాలిటీ టోల్ ఫ్రీ నంబర్ – 7330653331 కు సంప్రదించాలని సూచించారు. ప్రజల భద్రతే మున్సిపాలిటీ ప్రథమ ప్రాధాన్యత అని, సమస్యల పరిష్కారానికి మున్సిపల్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, స్థానిక కౌన్సిలర్ అనీస్ ఖుతీజా (అహ్మద్), టీపీబీఓ శ్రీకర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## పరికిపండ్ల నరహరిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

**విద్య, వైద్యం, ఉపాధి సేవా కార్యక్రమాలపై చర్చ**



వరంగల్, జూలై 30 (ఈవార్తలు): కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలోని భూ రికార్డుల విభాగంలో సంయుక్త కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి, ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరిని బీఆర్ఎస్ నాయకులు మంతెన అమరేష్, బేతి అశోక్ బాబు ఢిల్లీలోని కర్తవ్య భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు సంబంధించిన సేవా కార్యక్రమాలపై వారు విస్తృతంగా చర్చించారు. అనంతరం పరికిపండ్ల నరహరి మాట్లాడుతూ, వికలాంగులకు ఉచిత కృత్రిమ కాళ్ల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాల నిర్వహణ, కోవిడ్ సమయంలో ఆక్సిజన్ సాంద్రీకరణ యంత్రాల పంపిణీ వంటి ప్రజాహిత కార్యక్రమాలను ఆలయ ఫౌండేషన్ ద్వారా కొనసాగిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ సమాజానికి మరింత సేవలందించే కార్యక్రమాలను విస్తరించనున్నట్లు వెల్లడించారు. అలాగే, రానున్న వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో యువ నాయకులు పార్టీలకు అతీతంగా ప్రజాసేవను లక్ష్యంగా చేసుకుని ముందుకు రావాలని, నగర అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ భేటీలో సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణకు సంబంధించి పలు అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.

వయ్యారి చిత్రం



# శోభిత వయ్యారాలు అదరహో!



అక్కినేని కోడలు అనే కంటే.. అంతకుమించి అని నిరూపిస్తున్నారు శోభిత ధూళిపాల. తన ఇండివిడ్యువాలిటీ, అసాధారణ వ్యక్తిత్వం, గొప్ప జెన్ జి ఫ్యాషన్ సెన్స్ తో నిరంతరం చర్చల్లో నిలుస్తున్నారు. ముఖ్యంగా భారతీయ ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న శోభిత అక్కినేని (ధూళిపాళ్ల) ప్రతిసారీ తనదైన శైలితో ఆశ్చర్యపరుస్తూనే ఉన్నారు. మోడలింగ్ నుంచి నటన వరకు తన ప్రత్యేకతను చాటుకున్న శోభిత నేటి జెన్-జి ఫ్యాషనిస్టాలకు ఒక ఆధునిక గురువు అని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. ఏ ఇతర క్రియేటర్ లేదా మోడల్‌కు తగ్గని రీతిలో అక్కినేని కోడలు దుస్తుల ఎంపికలు నిరంతరం ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుంటాయి. తాజాగా ఢిల్లీలో జరిగిన అత్యంత ప్రతిష్టాత్మకమైన హ్యుందాయ్ ఇండియా కోచర్ వీక్ 2026 లో శోభిత మరోసారి తన ఫ్యాషన్ సెన్స్- గ్రాండియారిటీతో అందరి దృష్టినీ ఆకర్షించారు. ప్రముఖ డిజైనర్ రాహుల్ మిశ్రా రూపొందించిన డిజైన్ల ప్రదర్శనలో శోభిత అక్కినేని షో స్టాపర్‌గా నిలిచి.. ఈ ఈవెంట్‌కు అద్భుతమైన కళాత్మకతను జోడించారు. గత రాత్రి న్యూఢిల్లీలో జరిగిన ఈ ఫ్యాషన్ షోలో రాహుల్ మిశ్రా కొత్త కలెక్షన్ దేవికి సంబంధించిన ప్రత్యేక డిజైనర్ దుస్తులను ధరించి ర్యాంప్ వాక్ చేశారు. ప్రాచీన భారతీయ వైభవాన్ని, నేటి ఆధునిక రంగానికి అనుసంధానిస్తూ శోభిత చేసిన ఈ ర్యాంప్ వాక్ చూసిన వారందరూ కంటిరెప్ప వేయడం మరచిపోయారంటే అతిశయోక్తి కాదు. భారతీయ సంస్కృతిలోని గాంభీర్యాన్ని.. ఆధునిక శైలిని మేళవించి శోభిత తన ఫ్యాషన్ సెన్స్ ను ఆవిష్కరించిన తీరు ఫ్యాషన్ ప్రియులను అమితంగా మైమరపించింది. ఈ సందర్భంగా వోగ్ ఇండియాతో శోభిత మాట్లాడుతూ తన దుస్తుల వెనుక ఉన్న అంతరార్థాన్ని.. ప్రత్యేకతను వెల్లడించారు. ప్రాచీన భారతదేశం.. ప్రత్యేకించి ఒకానొక ప్రాంతంలోని దేవాలయాలు.. అక్కడి అద్భుతమైన శిల్పకళ నుంచి స్ఫూర్తి పొంది ఈ దుస్తులను రూపొందించారని శోభిత తెలిపారు. ఇవి పక్కాగా దేవి కోడెడ్ దుస్తులు అని వివరించారు.



# దక్షిణాదిలో టైం సెన్స్ ఎక్కువ: కాజల్

ఇండియన్ సినీ ఇండస్ట్రీలో భాషల మధ్య పోటీ ఎంత పెరుగుతుందో, వర్క్ కల్చర్ మరియు కథల ఎంపికలపై డిస్కషన్ కూడా అంతే వేగంగా ముందుకు సాగుతోంది. ముఖ్యంగా సౌత్ సినీ ఇండస్ట్రీలో సమయపాలన, ప్రొఫెషనల్ వాతావరణం, హీరోయిన్ల క్యారెక్టర్ రైటింగ్ లో కనిపిస్తున్న మార్పులు ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ తాజా కామెంట్స్ ఈ రెండు అంశాలను మరోసారి హైలైట్ చేశాయి. సినీ నిర్మాణంలో టైమ్ అనేది ఎంతో కీలకమైనది. ఒక షూటింగ్ షెడ్యూల్ ఆలస్యమైతే దాని ఎఫెక్ట్ నటీనటుల డేట్స్ నుంచి టెక్నికల్ టీమ్ వర్క్ అవర్స్ వరకు విస్తరిస్తుంది. ఈ నేపథ్యంలో సౌత్ ఇండస్ట్రీలో షెడ్యూల్‌కు కట్టుబడి పనిచేసే విధానం, బాలీవుడ్‌లో తరచుగా కనిపించే ఆలస్యాల సంస్కృతి మధ్య తేడాపై కాజల్ చేసిన కామెంట్స్ ప్రొడక్షన్ ఎఫిషియెన్సీపై కొత్త డిస్కషన్ కు దారితీశాయి. టైమ్ సెన్స్ అనేది కేవలం వ్యక్తిగత అలవాటుగా కాకుండా, మొత్తం సినిమా నిర్మాణ వ్యవస్థ సామర్థ్యాన్ని డిసైడ్ చేసే అంశంగా ఇండస్ట్రీ వర్గాలు భావిస్తాయి. అయితే ఆమె కామెంట్స్ కేవలం వర్క్ కల్చర్‌కే పరిమితం కాలేదు. కెరీర్ ఎంపికల విషయంలో కూడా ఎన్ని సినిమాలు చేశామనే నెంబర్ కంటే క్వాలిటీకే ప్రాధాన్యం ఇచ్చానని చెప్పడం గమనార్హం.

# సినిమా అంటే ఇంకా భయమే?



సినిమాల్లోకి రావాలనే తన డెసిషన్ కు ఇంట్లో ఎవరూ వెంటనే మద్దతివ్వలేదని, ముఖ్యంగా తన తల్లి తీవ్రంగా వ్యతిరేకించిందని భాగ్యశ్రీ చెప్పారు. ఆ టైమ్ లో తల్లి తనతో మాట్లాడకపోవడమే కాకుండా వాట్సాప్‌లో కూడా బ్లాక్ చేసిందని ఆమె వెల్లడించారు. ఆ సిట్యుయేషన్ కొన్ని నెలల తరబడి కొనసాగిందని చెప్పడం, ఒక నటిగా ఎదిగే ప్రయాణంలో ఎదురైన వ్యక్తిగత సంఘర్షణను తెలియచేస్తోంది. ఇది కేవలం భాగ్యశ్రీ కథ మాత్రమే కాదు. ఇండియన్ ఫ్యామిలీస్ లో సినీ ఇండస్ట్రీ గురించి ఉన్న అభిప్రాయలు ఇంకా పూర్తిగా మారలేదని పలువురు సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎంటర్టైన్‌మెంట్ ఇండస్ట్రీలో అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ, అది అనిశ్చితితో కూడుకున్న రంగమనే అభిప్రాయం చాలామంది తల్లిదండ్రుల్లో ఉంది. అందుకే మంచి ఉద్యోగాలు లేదా సాంప్రదాయ వృత్తుల వైపు తమ పిల్లలను ప్రోత్సహించే ధోరణి నేటికీ కొనసాగుతోంది. సక్సెస్‌ఫుల్ సెలబ్రిటీల జీవితాల్లో కనిపించే గ్లామర్ వెనుక ఎన్నో కనిపించని పోరాటాలుంటాయని ఈ విషయం మరోసారి నిరూపించింది. సిల్వర్ స్క్రీన్‌పై కనిపించే చిరునవ్వు వెనుక ఒంటరితనం, ఫ్యామిలీతో విభేదాలు, రిజెక్షన్స్, అనిశ్చితి వంటి అనుభవాలు ఎన్నో దాగి ఉంటాయని అర్థమవుతోంది. భాగ్యశ్రీ చెప్పిన తన లైఫ్ ఎక్స్‌పీరియెన్స్ కూడా అదే విషయాన్ని గుర్తు చేస్తుంది. అయితే కొన్నాళ్ల తర్వాత ఫ్యామిలీ కూడా తనను అర్థం చేసుకుని, తాను చేసిన కృషిని గౌరవించిందనే సంకేతాలు ఆమె మాటల్లో కనిపించాయి. ఈ సంఘటన తల్లిదండ్రులు తప్పు చేశారనే విషయం కంటే, వారి భయాలు కూడా ఒక సామాజిక వాస్తవమేనని గుర్తు చేస్తుంది. అదే సమయంలో యూత్ తమ ఆశయాలను సాధించాలంటే టాలెంట్‌తో పాటు సహనం, మానసిక ధైర్యం, ఫ్యామిలీతో సంభాషించే సామర్థ్యం కూడా ఎంత ముఖ్యమో భాగ్యశ్రీ అనుభవం స్పష్టం చేస్తోంది.

# మహేష్‌తో ప్రియాంక - నిక్ క్లిక్



దర్శకధీరుడు రాజమౌళి డైరెక్షన్ లో వస్తున్న వారణాసి సినిమాపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. సూపర్ స్టార్ మహేష్ బాబు, గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా మొదటి సారి ఈ సినిమాలో కలిసి నటిస్తున్నారు. సినిమా షూటింగ్ ఇప్పటికే దాదాపు చివరి దశకు చేరుకుంది. సెట్స్ లో ఎప్పుడూ బిజీగా ఉండే ఈ స్టార్స్ లేటెస్ట్ గా కాస్త బ్రేక్ తీసుకుని సరదాగా గడిపారు. షూటింగ్ గ్యాప్ లో మహేష్ బాబు, ప్రియాంక చోప్రా ఒకే ఫ్రేమ్ లో కనిపించి ఫ్యాన్స్ కు మంచి సర్ప్రైజ్ ఇచ్చారు. ప్రియాంక చోప్రా తన భర్త నిక్ జోనస్ తో కలిసి కొద్ది రోజులుగా హైదరాబాద్ లోనే ఉంటున్నారు. ఈ క్రమంలో వీరు ఏఎంబీ సినిమాస్ లో సందడి చేశారు. తన థియేటర్ కు వచ్చిన ఈ స్పెషల్ గెస్టులకు మహేష్ స్వయంగా ఆతిథ్యం ఇచ్చారు. ఈ ముగ్గురూ కలిసి ఏఎంబీ లాంజ్ లో దిగిన ఫోటో నెట్టింట బాగా వైరల్ అవుతోంది. ఈ వారణాసి స్టార్స్ ఇలా ఒకచోట కలవడానికి మెయిన్ రీజన్ హాలీవుడ్ మూవీ అని తెలుస్తోంది. క్రిస్టోఫర్ నోలన్ డైరెక్షన్ లో వచ్చిన లేటెస్ట్ హాలీవుడ్ సినిమా ది ఒడిస్సీ చూసేందుకు వీరంతా ఏఎంబీకి వచ్చారని సమాచారం. రెగ్యులర్ షూటింగ్ హడావిడి నుంచి కాస్త రిలాక్స్ అవ్వడానికి ఇలా ఒక మూవీ నైట్ ప్లాన్ చేసుకున్నారు. సినిమా చూస్తూ, ఒకరికొకరు మాట్లాడుకుంటూ ఈ స్టార్స్ కాసేపు చాలా క్యాజువల్ గా టైమ్ స్పెండ్ చేశారు. ఇక ఈ ఫోటోలో ముగ్గురి లుక్స్ సింపుల్ అండ్ స్టైలిష్ గా ఉన్నాయి.

# రియాలిటీ షోలో సమంత?



ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా హవాను కొనసాగించడానికి సామ్ ప్లాన్ చేస్తున్నారుట. ఇందులో భాగంగానే ఓ ప్రముఖ ఓటీటీ సంస్థతో భారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఓ సరికొత్త రియాలిటీ షో కోసం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఫిలిం నగర్ వర్గాల్లో చర్చకొస్తుంది. ఈ రియాలిటీ షోకు సంబంధించిన కాన్సెప్ట్ చాలా వినూత్నంగా ఉండబోతుందట. ఇప్పటి వరకు సమంతను కేవలం సినిమాల్లో గ్లామర్ పాత్రలలో.. నటనకు ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్లలో మాత్రమే చూసిన అభిమానులకు ఈ షో ద్వారా సామ్ అసలు సిసలు వ్యక్తిత్వం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుందని టాక్ నడుస్తోంది. సామ్ జీవితంలో కొన్ని ఆసక్తికర విషయాలు, ఫిట్‌నెస్ రహస్యాలు, లైఫ్ స్టైల్‌ను ఈ రియాలిటీ షో ద్వారా అభిమానులతో పంచుకోనున్నట్లు తెలుస్తోంది. డిజిటల్ మాధ్యమంలో తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్ ఉన్న సమంత ఈ షోతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకోవడం ఖాయం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అన్ని రకాల ఒప్పందాలు ఇప్పటికే పూర్తయ్యాయని త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనతో పాటు పూర్తి వివరాలు వెలువడనున్నాయని సమాచారం. ప్రముఖ ఓటీటీ సంస్థ ఈ షోను అత్యంత భారీ బడ్జెట్‌తో, గ్లోబల్ స్టాండర్డ్స్ లో తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తోంది. సినిమాలకు బ్రేక్ ఇచ్చినా? డిజిటల్ రంగంలో సామ్ చేస్తున్న సాహసోపేతమైన అడుగు ఇండస్ట్రీలో చర్చనీయాంశమైంది. ఈ షో కోసం ఓటీటీ ప్రియులు .. సమంత ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ట్రెండ్‌కు తగినట్లుగా కెరీర్‌ను మలుచుకోవడంలో సమంత ఎప్పుడూ ముందుంటారు. సినిమా థియేటర్లలో తన మ్యాజిక్ చూపించలేకపోయినా? ఇంటింటికీ నేరుగా చేరే ఓటీటీ మాధ్యమం ద్వారా ప్రేక్షకులకు టచ్‌లో ఉండాలనే ఆమె వ్యూహం చాలా ప్రశంసనీయం. నేటి డిజిటల్ యుగంలో స్టార్ హీరోలు ..హీరోయిన్లు కూడా ఓటీటీల వైపు మొగ్గు చూపడానికి సమంత తాజా నిర్ణయం చక్కని ఉదాహరణగా నిలుస్తోంది. సినిమాల ఒత్తిడి లేకుండా? తనకు నచ్చిన రీతిలో వినోదాన్ని పంచడానికి సామ్ ఈ వేదికను ఎంచుకోవడం విశేషం.



# క్రికెట్‌కు రహానె గుడ్‌బై



## అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు

### ధన్యవాదాలు తెలుపుతూ బీసీసీఐ పోస్ట్

### టెస్టుల్లో ఓటమి ఎరుగని కెప్టెన్‌గా రికార్డు

భారత సీనియర్ బ్యాటర్, టెస్టుల్లో జట్టుకు చారిత్రక విజయాలు అందించిన అజింక్య రహానె అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు నేడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక భావోద్వేగ వీడియో ద్వారా ప్రకటించాడు. దీంతో దాదాపు రెండు దశాబ్దాల పాటు సాగిన ఆయన కెరీర్‌కు తెరపడింది.

**రహానె రిటైర్మెంట్ ప్రకటనపై బీసీసీఐ వెంటనే స్పందించి, ఆయన సేవలను కొనియాడింది. “ఒక అద్భుతమైన కెరీర్ ముగిసింది. భారత క్రికెట్‌కు మీరు అందించిన అపారమైన సేవలకు, చిరకాలం గుర్తుండిపోయే జ్ఞాపకాలకు ధన్యవాదాలు. మీ తదుపరి ప్రయాణానికి మా శుభాకాంక్షలు” అని బీసీసీఐ ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేసింది.**

#### కెప్టెన్‌గా చెరగని ముద్ర

బ్యాటర్‌గానే కాకుండా కెప్టెన్‌గా కూడా రహానె తనదైన ముద్ర వేశాడు. టెస్టుల్లో ఓటమి ఎరుగని కెప్టెన్‌గా ఆయనకు అరుదైన రికార్డు ఉంది. కనీసం ఐదు మ్యాచ్‌లకు నాయకత్వం వహించిన భారత కెప్టెన్లలో అత్యధిక విజయశాతం రహానెదే కావడం విశేషం. అతని సారథ్యంలో భారత్ నాలుగు టెస్టుల్లో గెలిచి, రెండింటిని డ్రా చేసుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై 2020-21లో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టును చారిత్రక విజేతగా నిలపడం అతని కెప్టెన్సీ కెరీర్‌లో మరుపురాని ఘట్టం. విరాట్ కోహ్లీ గైర్హాజరీలో జట్టును ముందుండి నడిపించిన రహానె, మెల్‌బోర్న్‌లో అద్భుత విజయాన్ని అందించాడు. ముఖ్యంగా గబ్బాలో ఆస్ట్రేలియాకు ఏళ్ల తరబడి ఉన్న ఓటమి ఎరుగని రికార్డుకు బ్రేక్ వేసి సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో పాటు 2017లో ధర్మశాలలో ఆస్ట్రేలియాపై, 2018లో ఆఫ్ఘనిస్థాన్‌పై కూడా జట్టును విజయపథంలో నడిపించాడు.

#### మూడు ఫార్మాట్లలో గణాంకాలు

తన కెరీర్‌లో రహానే 85 టెస్టులు ఆడి 12 సెంచరీలు, 26 అర్ధ సెంచరీలతో కలిపి 5,077 పరుగులు చేశాడు. 90 వన్డేలలో 3 సెంచరీలు, 24 అర్ధ సెంచరీలతో 2,962 పరుగులు సాధించాడు. ఇక, 20 టీ20 మ్యాచ్‌లలో ఒక అర్ధ సెంచరీతో 375 పరుగులు చేశాడు. ఆటగాడిగా, నాయకుడిగా భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన రహానె రిటైర్మెంట్‌తో ఒక శకం ముగిసినట్లయింది.

#### నా ఇష్టమైన బ్యాటింగ్ పార్టనర్‌వి: కోహ్లీ




అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు అన్నిరకాల ఆటకు వీడ్కోలు పలికిన టీమిండియా వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానేకు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ అభినందనలు తెలియజేశాడు. తనకు అత్యంత ఇష్టమైన బ్యాటింగ్ పార్ట్‌నర్ రహానే అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురిపించాడు. రిటైర్మెంట్ తర్వాతి జీవితం మరింత సాఫీగా ముందుకు సాగాలని సోషల్ మీడియా వేదికగా కోహ్లీ పోస్ట్ పెట్టాడు. ‘జింక్స్(రహానే).. నీ అద్భుతమైన కెరీర్‌కు అభినందనలు మిత్రమా. నువ్వు భారత క్రికెట్‌కు ఎంతో చేశావు. నీ ప్రయాణానికి నువ్వు చాలా గర్వపడవచ్చు. స్లిప్‌లో అత్యంత నమ్మకైమన ఫీల్డర్‌వి. నాకు అత్యంత ఇష్టమైన టెస్ట్ బ్యాటింగ్ పార్ట్‌నర్‌వి. నీకు ఎప్పుడూ అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా. ఆ దేవుడి ఆశీస్సులు నీకు ఉంటాయి.’అని విరాట్ కోహ్లీ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. రహానేతో కలిసి దిగిన మైదానంలోని ఫొటోను పంచుకున్నాడు. టెస్ట్‌ల్లో విరాట్ కోహ్లీకి డిప్యూటీగా అజింక్యా రహానే మూడేళ్లు వ్యవహరించాడు.

# కామన్వెల్త్‌లో నీరజ్ దూకుడు

### రోహిత్, యశ్‌వీర్‌తో కలిసి ఫైనల్‌కు.. జావెలిన్ ఫైనల్‌కు చేరిన నీరజ్ చోప్రా

### రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్‌కూ అర్హత



గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు జావెలిన్ త్రో విభాగంలో శుభారంభం లభించింది. ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రాతో పాటు రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్ ముగ్గురూ పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించారు. బలమైన గాలుల కారణంగా అథ్లెట్లకు త్రో విసరడం కష్టంగా మారినా, అత్యుత్తమ ప్రదర్శన చేసిన 12 మంది ఫైనల్‌కు చేరుకున్నారు.

శుక్రవారం జరిగే ఫైనల్లో ఈ ముగ్గురు భారత అథ్లెట్లు పతకాల కోసం పోటీ పడనున్నారు. ఈ అర్హత పోటీలో ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ దూరమైన 84 మీటర్లను ఏ అథ్లెట్ అందుకోలేకపోయాడు. నీరజ్ చోప్రా తన రెండో ప్రయత్నంలో 79.61 మీటర్లు విసిరి ఐదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాడు. అప్పటికే అర్హత ఖరారవడంతో చివరి ప్రయత్నాన్ని ఉపయోగించుకోలేదు. రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు విసిరి తొమ్మిదో స్థానంలో నిలిచాడు. యశ్‌వీర్ సింగ్ 78.36 మీటర్లుతో పదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. గతేడాది సెప్టెంబర్ నుంచి నీరజ్ చోప్రాను నడుము కింది భాగం గాయం వేధిస్తోంది. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ముందు ఈ గాయం కావడంతో అతను ఆశించిన స్థాయిలో రాణించలేక ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గాయం కారణంగా ఈ ఏడాది సీజన్‌ను కూడా ఆలస్యంగా ప్రారంభించాడు. జూన్‌లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో ఒక్కసారి మాత్రమే బరిలోకి దిగి 85.69 మీటర్లు విసిరి నాలుగో స్థానంలో నిలిచాడు. అర్హత పోటీలో శ్రీలంక అథ్లెట్ రుమేశ్ పతిరాజే 82.84 మీటర్లు విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో అతని పేరిట ప్రపంచంలోనే అత్యుత్తమ త్రో 92.62 మీటర్లు ఉంది. గ్రెనడాకు చెందిన రెండుసార్ల ప్రపంచ ఛాంపియన్ అండర్సన్ పీటర్స్ 81.29 మీటర్లతో రెండో స్థానంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా అథ్లెట్ డౌ స్మిట్ 80.64 మీటర్లతో మూడో స్థానం దక్కించుకున్నాడు. ఇంగ్లండ్‌కు చెందిన బెన్ ఈస్ట్ నాలుగో స్థానంలో నిలవగా, ఆస్ట్రేలియా అథ్లెట్ కామెరాన్ మెక్‌ఎంటైర్ ఆరో స్థానంలో నిలిచాడు. పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శనగా 78.63 మీటర్లు విసిరి ఏడో స్థానంతో ఫైనల్‌కు చేరాడు. దీంతో శుక్రవారం జరిగే ఫైనల్లో నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్ మధ్య మరో ఆసక్తికర పోరు చూసే అవకాశం ఏర్పడింది.




# వన్డే వరల్డ్‌కప్ వేదికలు ఖరారు

క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. వచ్చే ఏడాది పురుషుల వన్డే ప్రపంచకప్ వేదికలను అంతర్జాతీయ క్రికెట్ మండలి ప్రకటించింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీని మొత్తంగా 12 నగరాల్లో నిర్వహించనుంది ఐసీసీ. అయితే.. సింహభాగం మ్యాచ్‌లు దక్షిణాఫ్రికాలోనే జరగనున్నాయని ఐసీసీ గురువారం వెల్లడించింది. జింబాబ్వేలోని మూడు, నమీబియాలో ఒకేఒక నగరంలో ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడిస్తామని అత్యున్నత బోర్డు పేర్కొంది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ వేదికలు ఖరారయ్యాయి. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ మొత్తంగా 12 నగరాల్లో జరగనుంది. ఆధునిక స్టేడియాల, మౌలిక వసతులు, ప్రేక్షకుల ఆదరణ.. ఈ మూడు విషయాలను దృష్టిలో పెట్టుకొని దక్షిణాఫ్రికాలోనే 8 సిటీలను ఎంపిక చేసింది ఐసీసీ. జింబాబ్వేలోని మూడు, నమీబియాలోని విండ్‌హోక్ నగరంలో ప్రపంచకప్ మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి.

## నాయకుడిగా ఎదిగేందుకే వైభవ్‌కు కెప్టెన్సీ!

భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి దులీప్ ట్రోఫీ-2026లో ఈస్ట్‌జోన్ వైస్ కెప్టెన్సీ అప్పగించడం చర్చనీయాంశమైంది. ఇంత చిన్న వయసులో బాధ్యతలు ఇవ్వడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని ఈస్ట్‌జోన్ సెలెక్టర్, మాజీ రంజీ క్రికెటర్ ప్రవంజన్ వెల్లడించారు. భవిష్యత్‌లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే వైభవ్‌కు ఈ బాధ్యతలు ఇచ్చామని చెప్పారు. ఈస్ట్‌జోన్ జట్టుకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడని, వైభవ్‌ను కెప్టెన్‌గా నియమించలేదని ప్రవంజన్ స్పష్టం చేశారు. ఇషాన్ వికెట్‌కీపర్ కావడంతో మ్యాచ్‌లో ఎక్కువ సమయం మైదానంలో చురుగ్గా ఉంటాడని చెప్పారు.

# టెస్టు సారథిగా మళ్లీ జో రూట్

#### హెడ్ కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్



ఇంగ్లండ్ టెస్టు క్రికెట్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. స్టార్ బ్యాటర్ జో రూట్ రెండోసారి టెస్టు జట్టు కెప్టెన్‌గా నియమితులయ్యాడు. అదే సమయంలో న్యూజిలాండ్ మాజీ కెప్టెన్, ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో ఒకరైన స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను టెస్టు జట్టు హెడ్ కోచ్‌గా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఎంపిక చేసింది. ఈ మేరకు నేడు అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇటీవల మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం, టెస్టు హెడ్ కోచ్ పదవి నుంచి బ్రెండన్ మెకల్లమ్‌ను తొలగించడంతో ఈ కీలక నియామకాలు జరిగాయి. గతంలో 2017 నుంచి 2022 వరకు రూట్ 64 టెస్టుల్లో ఇంగ్లండ్‌కు సారథ్యం వహించాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ తాత్కాలిక కెప్టెన్‌గా జట్టును నడిపించాడు. టెస్టు క్రికెట్‌లో 14,000 పరుగులకు పైగా సాధించి, సచిన్ టెండూల్కర్ తర్వాత అత్యధిక పరుగుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ సందర్భంగా రూట్ మాట్లాడుతూ.. “మళ్లీ ఇంగ్లండ్ టెస్టు జట్టుకు కెప్టెన్‌గా ఎంపికవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇది కష్టమైన బాధ్యత అయినా, ఎంతో సంతృప్తినిస్తుంది. తర్వాతి తరం ఆటగాళ్లను ముందుకు నడిపించడానికి ఉత్సాహంగా ఉన్నాను” అని తెలిపాడు. ఫ్లెమింగ్‌ను ఆటపై అపారమైన పరిజ్ఞానం ఉన్న అద్భుతమైన నాయకుడిగా అభివర్ణించాడు. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ నియామకాన్ని ఈసీబీ మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీ సమర్థించాడు. ఫ్లెమింగ్ ప్రపంచ క్రికెట్‌లో అత్యంత గౌరవనీయమైన కోచ్‌లలో ఒకరని, జట్టులోని ప్రతిభను ప్రపంచ స్థాయి ప్రదర్శనగా మార్చగలరని విశ్వాసం వ్యక్తం చేశాడు. ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. “ప్రస్తుత విజయాలతో పాటు జట్టుకు మధ్యకాలిక, దీర్ఘకాలిక భవిష్యత్తును అందించడమే లక్ష్యం. కెప్టెన్ జో రూట్‌తో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను.

# బ్లూ జెర్సీ.. హాకీ ఇండియా క్లారిటీ




భారత జాతీయ హాకీ జట్ల జెర్సీ రంగును సాంప్రదాయ నీలి రంగు నుంచి కాషాయ రంగుకు మార్చడంపై చెలరేగిన వివాదంపై హాకీ ఇండియా స్పందించింది. ఇది కేవలం సాంకేతిక అవసరాల దృష్ట్యా ఆటగాళ్లు, సహాయక సిబ్బంది సూచనల మేరకే తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేసింది. ఈ మార్పు వెనుక ఉన్న అసలు కారణాలను వివరిస్తూ ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. వచ్చే నెల నెదర్లాండ్స్, బెల్జియంలో జరగనున్న 2026 హాకీ ప్రపంచకప్‌లో పురుషుల, మహిళల జట్లు కాషాయ రంగు జెర్సీలతో బరిలోకి దిగుతాయని ఈ నెల 27న హాకీ ఇండియా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా భారత హాకీ మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా ఈ మార్పును ప్రశ్నించడంతో వివాదం మరింత పెద్దదైంది. ఈ వివాదంపై స్పందించిన హాకీ ఇండియా.. “అంతర్జాతీయ హాకీ పిచ్‌లు ఇప్పుడు ప్రామాణికంగా నీలి రంగు సింథటిక్ టర్ఫ్‌తో ఉంటున్నాయి. మన ఆటగాళ్లు ధరించే నీలి రంగు జెర్సీ ఈ టర్ఫ్‌లో కలిసిపోతోంది. దీనివల్ల మైదానంలో ఆటగాళ్లకు స్పష్టత లోపించి, ఆటపై ప్రభావం పడుతోంది. ఈ సాంకేతిక సమస్యను అధిగమించేందుకే జెర్సీ రంగు మార్చాలని నిర్ణయించాం” అని తన ప్రకటనలో పేర్కొంది. ఆటగాళ్లు, కోచ్‌లతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది. మరోవైపు మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తన ‘ఎక్స్’ (ట్విట్టర్) ఖాతాలో.. “భారత హాకీకి నీలి రంగు అనేది గర్వకారణం, గుర్తింపు, వారసత్వం” అని అన్నారు. ఆయన పోస్ట్ వైరల్ కావడంతో చర్చ మొదలైంది. అయితే, తన పోస్టుకు అనవసరంగా రాజకీయ రంగు పులుముతున్నారని ఆయన ఆ తర్వాత ఆవేదన వ్యక్తం చేశారు. ఆటగాళ్లు, కోచ్‌లు పసుపు లేదా కాషాయం రంగును ప్రత్యామ్నాయంగా సూచించారని, మన జాతీయ జెండాలో కాషాయం రంగు ధైర్యానికి, త్యాగానికి, జాతీయ గౌరవానికి ప్రతీక కావడంతో దానిని ఖరారు చేశామని హాకీ ఇండియా తెలిపింది. జెర్సీ రంగును మార్చడం ఇదే మొదటిసారి కాదని కూడా గుర్తు చేసింది. “2014 ప్రపంచకప్‌లో జట్టు జెర్సీని పసుపు రంగులోకి, 2018 ప్రపంచకప్‌లో స్కై బ్లూ రంగులోకి మార్చాం. కార్యాచరణ అవసరాల మేరకు గతంలోనూ ఇలాంటి మార్పులు జరిగాయి” అని వివరించింది. సాంకేతిక అవసరాలు, జాతీయ భావన రెండింటినీ పరిగణనలోకి తీసుకుని ఈ మార్పు చేసినట్లు హాకీ ఇండియా స్పష్టం చేసింది.

ఈవార్తలు
# ప్రజావాణి
గురువారం 30-7-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# సేంద్రియమే భవిష్యత్తుకు భరోసా

వేల ఏళ్లుగా భారతదేశం వ్యవసాయ ఆధారిత నాగరికతగా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. ప్రకృతితో మమేకమై సాగు చేసిన మన పూర్వీకులు నేల సారాన్ని కాపాడుతూ ఆహార భద్రతను సాధించారు. కానీ గత ఐదు దశాబ్దాలుగా అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం విపరీతంగా పెరగడంతో నేల ఆరోగ్యం, పర్యావరణం, ప్రజల ఆరోగ్యం కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో సేంద్రియ వ్యవసాయం కేవలం ప్రత్యామ్నాయ సాగు విధానం కాదు; భవిష్యత్ తరాల మనుగడకు అవసరమైన జీవన విధానంగా మారుతోంది. హరిత విప్లవం దేశాన్ని ఆహార ధాన్యాల్లో స్వయం సమృద్ధి వైపు నడిపించిన విషయం వాస్తవం. కానీ అదే సమయంలో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల అధిక వినియోగం వల్ల నేలలోని సూక్ష్మజీవులు తగ్గిపోయాయి. భూమి సారం క్రమంగా క్షీణించింది. భూగర్భ జలాల్లో రసాయన అవశేషాలు పెరిగాయి. ఆహార పదార్థాల్లో పురుగుమందుల అవశేషాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ఎకరానికి తక్కువ ఎరువుతో మంచి దిగుబడి వచ్చిన భూముల్లో, ఇప్పుడు మరింత ఎరువు వేసినా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఇది నేల ఆరోగ్యం ఎంతగా దెబ్బతిందో చెప్పే సంకేతం. సేంద్రియ వ్యవసాయం అంటే కేవలం రసాయన ఎరువులు వాడకపోవడం మాత్రమే కాదు. ప్రకృతి సిద్ధమైన పద్ధతుల్లో నేల సారాన్ని పెంచడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం, పశు సంపదను వ్యవసాయంతో అనుసంధానం చేయడం, స్థానిక విత్తనాలను ప్రోత్సహించడం, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం వంటి సమగ్ర వ్యవసాయ విధానం. ఈ విధానంలో పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్, జీవామృతం, ఘన జీవామృతం, పంచగవ్య, హరిత ఎరువులు, పంటల మార్పిడి, మిశ్రమ పంటలు వంటి పద్ధతులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఇవి నేలలోని సూక్ష్మజీవుల సంఖ్యను పెంచి సహజసిద్ధమైన సారాన్ని పునరుద్ధరిస్తాయి. ఫలితంగా భూమి నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం పెరుగుతుంది. ఎండలను కూడా కొంతవరకు తట్టుకునే శక్తి పెరుగుతుంది. నేటి ప్రపంచంలో ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. రసాయన అవశేషాలు తక్కువగా ఉండే ఆహార పదార్థాలకు డిమాండ్ పెరుగుతోంది. దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లో కూడా సేంద్రియ ఉత్పత్తులకు మంచి ధర లభిస్తోంది. పండ్లు, కూరగాయలు, మసాలా దినుసులు, బియ్యం, పప్పుధాన్యాలు, తేనె వంటి సేంద్రియ ఉత్పత్తులకు ఎగుమతి అవకాశాలు కూడా విస్తరిస్తున్నాయి. అంటే సేంద్రియ వ్యవసాయం రైతుకు ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు మెరుగైన ఆదాయానికి కూడా దారి తీసే అవకాశం ఉంది. అయితే ఈ మార్పు అంత సులభం కాదు. రసాయన వ్యవసాయం నుంచి సేంద్రియ వ్యవసాయానికి మారే తొలి రెండు మూడు సంవత్సరాల్లో దిగుబడి కొంత తగ్గే అవకాశం ఉంటుంది. సేంద్రియ ధ్రువీకరణ (సర్టిఫికేషన్) ప్రక్రియ క్లిష్టంగా ఉండటం, మార్కెటింగ్ వ్యవస్థ బలహీనంగా ఉండటం, వినియోగదారులకు నేరుగా చేరే అవకాశాలు తక్కువగా ఉండటం వంటి సమస్యలు రైతులను వెనక్కి నెడుతున్నాయి. అందుకే ప్రభుత్వాలు ఈ మార్పు దశలో రైతులకు ఆర్థిక భరోసా, శిక్షణ, మార్కెట్ సదుపాయాలు కల్పించాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కూడా సేంద్రియ వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయి. కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, వర్షాధార వ్యవసాయ ప్రాంతాల్లో సహజ సాగును మరింత విస్తరించే అవకాశం ఉంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, సహకార సంఘాల ద్వారా సేంద్రియ ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. "తెలంగాణ ఆర్గానిక్", "ఆంధ్ర ఆర్గానిక్" వంటి ప్రాంతీయ బ్రాండ్లను ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేసే ప్రయత్నాలు అవసరం. సేంద్రియ వ్యవసాయం అంటే రసాయనాలను పూర్తిగా వదిలేయడమే కాదు; సమతుల్య వ్యవసాయం వైపు అడుగులు వేయడం. నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, సమగ్ర పోషక నిర్వహణ, సమగ్ర పురుగుల నియంత్రణ, సూక్ష్మపోషకాల వినియోగం వంటి శాస్త్రీయ పద్ధతులను కూడా ప్రోత్సహించాలి. ఒకేసారి మొత్తం వ్యవసాయాన్ని మార్చడం కంటే దశలవారీగా మార్పులు తీసుకురావడం మరింత ఆచరణీయమైన మార్గం. వాతావరణ మార్పుల నేపథ్యంలో సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత మరింత పెరిగింది. అధిక రసాయన వినియోగం వల్ల వెలువడే హరిత గృహ వాయువులను తగ్గించడంలో, నేలలో కార్బన్ నిల్వ పెంచడంలో, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంలో సేంద్రియ వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాదు, నీటి వినియోగాన్ని తగ్గించి, భూమి తేమను నిలుపుకోవడంలో కూడా ఇది సహాయపడుతుంది. అందుకే సేంద్రియ వ్యవసాయం రైతు కోసం మాత్రమే కాదు; ప్రతి కుటుంబం కోసం, ప్రతి పౌరుడి ఆరోగ్యం కోసం, భూమి భవిష్యత్తు కోసం అవసరం. ప్రకృతిని కాపాడే వ్యవసాయమే రేపటి తరాలకు మనం అందించగల గొప్ప వారసత్వం.



## ఎందుకీ నోటిదురుసు?

పదవి అంటే ప్రజల నమ్మకం,
పలుకు అంటే ప్రజల గౌరవం.
నాయకుడి మాటలో నిగ్రహం లేకుంటే,
నాయకత్వానికి మిగిలేది ఏముంటుంది?

మాట ఒకటి మంట రగిలిస్తుంది,
మాట ఒకటి మనసు గెలిపిస్తుంది.
పలుకు పదునుగా ఉండొచ్చు గానీ,
పరుషంగా ఉండకూడదు.

అధికారం శాశ్వతం కాదు,
అహంకారం అభరణం కాదు.
నేడు చప్పట్లు కొట్టిన జనమే,
రేపు తీర్పు చెప్పే న్యాయమూర్తులు.

ప్రత్యర్థిని విమర్శించు,
కానీ వ్యక్తిత్వాన్ని కాదు.
వాదించు,
కానీ విలువలను విడిచిపెట్టకు.

రేవంత్ రెడ్డి గారూ..
రాజకీయ రణరంగంలో
మాటల మంటలు కాదు,
మర్యాదల వెలుగులు నింపండి.

నోటి దురుసుకు కళ్లెం వేయండి,
ప్రజాస్వామ్యానికి పరిమళం అద్దండి.
పదవికి హుందాతనం,
పలుకుకు సంస్కారం జోడించండి.

చరిత్రలో నిలిచేది
కఠినమైన మాట కాదు,
హుందాగా పలికిన
హృదయపూర్వక వాక్యమే.

**- ఉజ్వల.ఎం,**
**మిర్యాలగూడ, నల్లగొండ**






# పట్టణ వరదలు.. ప్రణాళికేది?

"వర్షం పడితే ఆనందపడే నగరాలు ఉన్నాయి... భయపడే నగరాలు ఉన్నాయి." దురదృష్టవశాత్తు హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని అనేక పట్టణాలు రెండో జాబితాలోకి చేరుతున్నాయి. ఒకప్పుడు వరదలు అంటే నదీతీర ప్రాంతాల సమస్యగా భావించేవారు. ఇప్పుడు గంటపాటు కురిసే భారీ వర్షమే నగరాలను నీట ముంచుతోంది. రోడ్లు చెరువుల్లా మారుతున్నాయి. వాహనాలు చిక్కుకుపోతున్నాయి. కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి.

ఆసుపత్రులు, పాఠశాలలు, ఐటీ కార్యాలయాలు, మెట్రో నగర జీవనం ఒక్కసారిగా స్తంభిస్తోంది. ఇటీవల తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో పలుచోట్ల రెడ్ అలర్ట్ ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడటం, ఐటీ సంస్థలకు వర్క్ ఫ్రం హోమ్ సూచనలు ఇవ్వడం పట్టణ వరదల తీవ్రతను మరోసారి గుర్తు చేసింది. ఇది ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు. ప్రణాళిక వైఫల్యం, నియంత్రణల లోపం, నిర్లక్ష్య పట్టణాభివృద్ధి కలగలిపిన మానవసృష్టి సంక్షోభం కూడా. హైదరాబాద్ ప్రపంచ స్థాయి ఐటీ నగరంగా ఎదిగింది. గగనచుంబి భవనాలు, విశాల రహదారులు, ఫ్లైఓవర్లు, మెట్రో రైలు, ఔటర్ రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాలు నగర రూపాన్ని మార్చేశాయి. కానీ వర్షపు నీటిని మోసుకెళ్లే నాలాలు, డ్రైనేజీ వ్యవస్థ, చెరువుల అనుసంధానం, సహజ జలమార్గాల సంరక్షణ మాత్రం అదే వేగంతో అభివృద్ధి చెందలేదు. ఫలితంగా వర్షం పడిన ప్రతిసారి నగరం పరీక్షను ఎదుర్కొంటోంది. పట్టణ వరదలకు ప్రధాన కారణం వర్షపాతం పెరగడం మాత్రమే కాదు; నగరాల స్వరూపం మారిపోవడం. ఒకప్పుడు వర్షపు నీరు భూమిలోకి ఇంకేది. ఇప్పుడు కాంక్రీటు రోడ్లు, సిమెంట్ భవనాలు, పార్కింగ్ ప్రదేశాలు, పేవ్‌మెంట్‌లతో భూమి దాదాపు పూర్తిగా మూసుకుపోయింది. నీరు ఇంకే అవకాశం లేకపోవడంతో మొత్తం నీరు ఒకేసారి రోడ్లపైకి వచ్చేస్తోంది. ఇదే పట్టణ వరదలకు ప్రధాన కారణం. ఇంకో పెద్ద సమస్య చెరువులు, నాలాల ఆక్రమణలు. తెలంగాణలోని అనేక పట్టణాలు, ముఖ్యంగా హైదరాబాద్, ఒకప్పుడు వందలాది చెరువులతో అనుసంధానమైన జలవ్యవస్థను కలిగి ఉండేది. కాలక్రమేణా అనేక చెరువులు కుదించబడ్డాయి. కొన్ని పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. సహజ నీటి మార్గాలపై నిర్మాణాలు పెరిగాయి. నీరు తన సహజ మార్గాన్ని కోల్పోయినప్పుడు అది రోడ్లను ఎంచుకోవడం సహజమే. ఘన వ్యర్థాల నిర్వహణ కూడా వరదలను మరింత తీవ్రతరం చేస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తతో మూసుకుపోయిన డ్రైన్లు వర్షపు నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. వర్షం కురిసిన కొద్ది నిమిషాల్లోనే నీరు నిలిచిపోవడానికి ఇది ప్రధాన కారణాల్లో ఒకటి. అధికారిక విపత్తు నిర్వహణ ప్రణాళిక కూడా డ్రైన్లలో మట్టి పేరుకుపోవడం, చెత్త, ఆక్రమణలు, తగిన సామర్థ్యం లేని వర్షపు నీటి కాలువలు పట్టణ వరదలకు ప్రధాన కారణాలని పేర్కొంటోంది. వాతావరణ మార్పులు పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయి. గతంలో ఒక నెలలో కురిసే వర్షం ఇప్పుడు కొన్ని గంటల్లోనే కురుస్తోంది. అధిక తీవ్రతతో తక్కువ సమయంలో కురిసే వర్షాలను తట్టుకునేలా మన పట్టణాల మౌలిక సదుపాయాలు రూపకల్పన కాలేదు. కాబట్టి నేటి వర్షపాతం నమూనాలకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు కూడా సమస్య తీవ్రతను గుర్తిస్తున్నాయి. హైదరాబాద్ పరిధిని దాటి మొత్తం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ కోసం సమగ్ర స్టార్మ్‌వాటర్ మాస్టర్ ప్లాన్ రూపొందించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రణాళికలో డ్రైనేజీ నెట్‌వర్క్ మ్యాపింగ్, జలమార్గాల గుర్తింపు, వరద ప్రమాద ప్రాంతాల విశ్లేషణ, ఆధునిక హైడ్రాలజీ నమూనాల ఆధారంగా భవిష్యత్ ప్రణాళికకు రూపకల్పన వంటి అంశాలు ఉన్నాయి. అలాగే గతంలో ప్రారంభించిన స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా కొన్ని ప్రాంతాల్లో నీటిముంపు సమస్య తగ్గిందని నివేదికలు సూచిస్తున్నాయి. కానీ నగరం విస్తరిస్తున్న వేగంతో పోలిస్తే ఈ చర్యలు ఇంకా విస్తృత స్థాయిలో అమలు కావాల్సి ఉంది. ఇకపై తీసుకోవాల్సిన చర్యలు మరింత స్పష్టంగా ఉండాలి.

ప్రతి పట్టణానికి స్టార్మ్ వాటర్ మాస్టర్ ప్లాన్ తప్పనిసరి కావాలి. ఎక్కడ వర్షపు నీరు చేరుతుంది? ఎక్కడ నిలుస్తుంది? ఎక్కడికి వెళ్లాలి? అనే పూర్తి శాస్త్రీయ మ్యాపింగ్ ఉండాలి. చెరువులు, నాలాలు, వాగులపై ఆక్రమణలను రాజకీయాలకు అతీతంగా తొలగించాలి. నీటి మార్గాలకు ప్రత్యామ్నాయం ఉండదు. ప్రతి కొత్త లేఅవుట్, అపార్ట్‌మెంట్, వాణిజ్య సముదాయానికి వర్షపు నీటి నిర్వహణ వ్యవస్థ తప్పనిసరి చేయాలి. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి సంవత్సరం వర్షాకాలానికి ముందు డ్రైన్ల పూడికతీత, చెత్త తొలగింపు, నాలాల తనిఖీ పూర్తిచేయాలి. కేవలం అత్యవసర చర్యలకే పరిమితం కాకుండా, ఇది నిరంతర ప్రక్రియగా మారాలి. పట్టణ ప్రణాళికలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని ప్రధాన ప్రమాణంగా పరిగణించాలి. గత శతాబ్దపు వర్షపాతం లెక్కలతో కాదు, భవిష్యత్ తీవ్ర వర్షాల అంచనాలతో మౌలిక సదుపాయాలను రూపొందించాలి. ప్రజల బాధ్యత కూడా అంతే ముఖ్యం. ప్లాస్టిక్ వ్యర్థాలను నాలాల్లో వేయడం, చెరువులను చెత్తకుప్పలుగా మార్చడం, వర్షపు నీటి సంరక్షణను నిర్లక్ష్యం చేయడం వంటి అలవాట్లు మారకపోతే ప్రభుత్వ చర్యలు ఒక్కటే సరిపోవు. పట్టణ వరదలు ప్రకృతి వైపరీత్యం కాదు; చాలా సందర్భాల్లో ప్రణాళిక వైఫల్యానికి అద్దం పడతాయి. రోడ్లు, ఫ్లైఓవర్లు, గగనచుంబి భవనాలు ఒక నగర అభివృద్ధికి గుర్తులైతే, వర్షం పడిన గంటలోనే నీటిని బయటకు పంపగల డ్రైనేజీ వ్యవస్థ ఆ నగర పరిపక్వతకు గుర్తు. తెలంగాణ పట్టణాల భవిష్యత్తు కేవలం కాంక్రీటుతో కాదు.. నీటికి దారి ఇచ్చే ప్రణాళికతోనే సురక్షితంగా ఉంటుంది.



**శశిధర్ అక్కెల, హైదరాబాద్**

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.